జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 25, ఆగస్టు 2023 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం







ఇండియా కూటమి ఎమ్మెల్యేలతో గవర్నర్ సంతోష్ గంగ్వార్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం అని తెలియజేసిన అనంతరం సీఎం సోరెన్‌తో కలిసి వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ఎక్స్‌ప్రెస్

## జగన్-లోకేష్-షర్మిల...

# ఒక ప్రెస్‌మీట్.. మరో డిక్టేషన్!

- డిక్టేషన్‌లా సాగుతున్న జగన్ ప్రెస్‌మీట్
- రికార్డు చేసిన ప్రెస్‌మీట్లే ఎక్కువ
- నెగటివ్ ప్రశ్నలు వేస్తే జగన్ వద్ద కనిపించని జవాబు
- యాజమాన్యానికి ప్రశ్నలు వేసిన వారిపై ఫిర్యాదు
- చెప్పాల్సింది చెప్పేసి వెళుతున్న జగన్
- ఎంపిక చేసిన మీడియాకే ప్రెస్‌మీట్లకు పిలుపు
- జగన్‌పై ప్రశ్నలు వేయాలంటే మీడియాకు జంకు
- అందుకు భిన్నంగా మంత్రి లోకేష్ శైలి
- తొలిరోజుల్లో పూర్తి తడబాటు
- భాషాదోషాలతో దారుణమైన ట్రోలింగ్‌కు గురి
- గత ఐదేళ్లలో రాటుతేలిన వైనం
- మీడియాను పిలిచి మరీ సమాధానాలిస్తున్న తీరు
- నెగటివ్ ప్రశ్నలు వేసినా జవాబిచ్చే వైఖరి
- సీఎంగా చేసినా ఇంకా మీడియాను ఎదుర్కొనేందుకు జగన్ జంకు





మహానాడు ఫోకస్

(మార్తి సుబ్రహ్మణ్యం)

ఇద్దరూ యువకులే. అందులో ఒకరు ఐదేళ్లు రాష్ట్రానికి సీఎంగా చేసిన ఒక పార్టీ అధ్యక్షుడు. మరొకరు రెండుసార్లు మంత్రిగా పనిచేస్తున్న మంత్రి. ఇద్దరికీ అనుభవం-అధికారంలో తేడా ఉంది. అందులో ఒకరు వైసీపీ అధినేత-మాజీ సీఎం జగన్ అయితే.. మరొకరు మంత్రి లోకేష్. ఈ ఇద్దరూ మీడియాను ఎదుర్కొంటున్న తీరు-శైలి భలే గమ్మత్తుగా, వింతగానూ, విభిన్నంగానూ కనిపిస్తోంది. ఐదేళ్లు సీఎంగా పనిచేసిన జగన్, మీడియా ప్రశ్నలకు జవాబిచ్చేందుకు జంకుతుంటే.. లోకేష్ అదుకు భిన్నంగా- నిర్భయంగా బదులిస్తున్న వైఖరి మీడియా వర్గాలకు ఆకర్షిస్తోంది.

తండ్రి మృతి తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో అవిశ్రాంతంగా ఓదార్పు యాత్ర చేసి, విస్తృతమైన ప్రజాభిమానం సంపాదించుకున్న నేత జగన్. కాంగ్రెస్‌పై తిరుగుబాటు చేసి, జైలుకు వెళ్లినా 67 స్థానాలు సాధించిన ధీశాలి ఆయన. విపక్షంలో ఉన్నా, ఓటమికి వెరవకుండా 23 మంది ఎమ్మెల్యేలు జంపయినా ఏమాత్రం ఆత్మస్థైర్యం కోల్పోకుండా, అధికార పగ్గాలు అందుకున్న యువనేత. మొండితనానికి కేరాఫ్ అడ్రస్.

అంటే ఆ ప్రకారంగా ఈ సుదీర్ఘకాలంలో జగన్ ఎంతో అనుభవం సంపాదించాలి ఉండాలి. ఎదురు దెబ్బలు, వెన్నుపోట్లు, తిరుగుబాట్లతో పాటు.. ప్రజాభిమానం చూరగొన్న జగన్‌కు ప్రపంచం చాలా నేర్పించి ఉండాలి. చాలా అనుభవం మిగిల్చి ఉండాలి.

అందువల్ల మీడియాను సులభంగా-అవలీలలగా ఎదుర్కోవడం ఆయనకు కొట్టిన పిండి కావాలి. అసలు అది ఆయనకు సమస్య కాకూడదు. ఎంత చిక్కు ప్రశ్నలకయినా.. అవలీలగా సమాధానాలు చెప్పాల్సినంత అనుభవం సంపాదించుకున్నారు. అయినా జగన్‌కు ఇప్పటికీ మీడియా అంటే భయమే. ప్రెస్‌మీట్ పెడితే అదొక ప్రహసనమే. ప్రెస్‌మీట్ గడిస్తే చాలనుకునేంత పిరికితనం. ఎందుకో తెలియదు.

నిజానికి జగన్ సీఎంగా ఉన్నప్పుడు కూడా, మీడియాతో మాట్లాడిన సందర్భాలు బహు తక్కువ. ఒకవేళ మాట్లాడినా తాను ఎంపిక చేసుకున్న పత్రికలు-చానెళ్లను మాత్రమే పిలిచేవారు. ఎవరూ ప్రశ్నలు వేసేందుకు లేదు. అప్పుడప్పుడు ఓ రెండు చానెళ్లకు చెందిన మహిళా జర్నలిస్టులు ప్రశ్నలు వేస్తే, వాటికి పొడి పొడిగా బదులిచ్చేవారు. అసెంబ్లీలోని ఆయన చాంబరులో అప్పుడప్పుడు జరిగే ప్రెస్‌మీట్లు కూడా డిటో. ఇక వివాదాస్పద ప్రశ్నలకు జగన్ బదులివ్వరు. చేతులు నలిపేసుకుని, మెడ అటు ఇటు తిప్పేసుకుంటూ సమాధానం దాటేస్తుంటారు. అవన్నీ 'ఇప్పుడెందుకులేన్నా' అని తప్పించుకుంటారు.

నిజానికి సీఎం స్థాయి వ్యక్తి, అందునా ఒక పార్టీ అధినేత వద్ద బోలెడు సరుకు ఉండాలి. ఏ ప్రశ్న వేసినా ఠక్కున బదులిచ్చే స్థాయికి ఎదగాలి. లేదా లౌక్యంగా తప్పించుకునే తెలివైనా ఉండాలి. ఒక ప్రశ్నకు మరో జవాబిచ్చే నేర్పయినా ఉండాలి. ప్రధానంగా రాజకీయ అంశాలకు సంబంధించిన ప్రశ్నలకు, జవాబులివ్వడం పెద్ద కష్టం కాదు. సీఎం, పార్టీ అధినేత స్థాయిలో తనకున్న అనుభవంతో జగన్ వీటికి సమాధానాలివ్వడం బహు సులభం. కానీ జగన్‌కు వీటిలో ఏ ఒక్క లక్షణాలు లేకపోవడమే ఆశ్చర్యం.

ప్రధానంగా ఏ నాయకుడైనా విపక్షంలోకి వచ్చిన తర్వాత మీడియాను వీలైనంత ఎక్కువగా వాడుకుంటారు. ఎందుకంటే వారికి ఆ సమయంలో అదే సరైన వేదిక. చంద్రబాబు నాయుడు, కేసీఆర్, రేవంత్ వంటి నేతలంతా విపక్షంలో ఉండగా.. మీడియాను వీలైనంత ఎక్కువ వినియోగించుకున్న వారే. పైగా విపక్షంలో ఉన్నప్పుడే ప్రజాసమస్యలు ఎక్కువగా తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. మీడియా ఇచ్చే ఇన్‌పుట్స్ కూడా ఎక్కువగానే ఉంటాయి. వాటి ఆధారంగా అధికారపక్షాన్ని తమ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటారు.

మిగతా.. 2లో





03

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



03

మినీ అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



04

జిల్లేడుబండ రిజర్వాయర్ భూ సేకరణకు నిధులివ్వండి



06

ఎమ్మిగనూరులో టెక్స్ టైల్స్ పార్కు నిర్మించి తీరుతాం

T-SAT

05

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు 'టి-సాట్' జనరల్ స్టడీస్ ఫర్ ఆల్

## ఎన్నుకున్న ప్రజల కోసం

# కష్టపడి పని చేయండి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



రాంచీ,మహానాడు: ఈ దేశాన్ని ఒక వికృతమైన పార్టీ పరిపాలిస్తోంది, ఆ పార్టీని కాదని మిమ్ములను ఎన్నుకున్న ప్రజల కోసం కష్టపడి పని చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఉదయం సీఎం హేమంత్ సోరేనను కాంగ్రెస్ కీలక నేతలతో కలిసి చర్చలు జరిపారు. తదుపరి ఇండియా కూటమి నేతలు అంతా కలిసి గవర్నర్ను సంప్రదించి సంఖ్యా బలాన్ని వివరించారు. ఆదివారం సాయంత్రం రాంచీలోని హోటల్ చాణక్యలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశంలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని వికృత పార్టీ చూస్తోంది. అటువంటి విచ్ఛిన్నకర పార్టీని కాదని మిమ్ములను ఎన్నుకున్న ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు గట్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యేలను కోరారు. ఈ సమావేశంలో కూర్చున్న వాళ్లు అదృష్టవంతులు, ఎంతోమంది కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయాలని బలంగా ఆశించారు. ఆశించిన అందరికీ సీట్లు దొరకలేదు... కానీ రాజకీయాల్లో పనిచేయడం ఒక ఎత్తు అయితే కాంగ్రెస్ పార్టీలో పని చేయడం అదృష్టం అనుకోవచ్చు అని వివరించారు. ఎందుకంటే ఈ పార్టీ దేశాన్ని వలస పాలన నుంచి విముక్తి చేసింది, ప్రజాస్వామ్య పరిరక్షణకు అలుపెరగని పోరాటం చేస్తుంది అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పార్టీ మిమ్ములను సాదరంగా ఆహ్వానిస్తుంది, తెలంగాణ ప్రభుత్వం, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పక్షాన మీ అందరిని అభినందిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జారండ్ ఇంచార్జ్ సిరివెళ్ల ప్రసాద్, ఏఐసీసీ కార్యదర్శి గులాం అహ్మద్ మీర్, పార్టీ సీనియర్ పరిశీలకుడు పీసీసీ ప్రెసిడెంట్ కేశవ్ మహాతో తదితర నాయకులు పాల్గొన్నారు.





# ఉద్యమ చరిత్రపై కేసీఆర్ చెరిగిపోని సంతకం

- మళ్లీ రెండు జాతీయ పార్టీల మెడలు వంచాల్సిన పరిస్థితి
- నవంబర్ 29న 33 జిల్లాల్లో మా పార్టీ కార్యాలయాల్లో ఘనంగా దీక్షా దివస్
- దీక్షా దివాస్ కార్యక్రమ నిర్వహణ కోసం ఈ నెల 26 న అన్ని జిల్లాల్లో సన్నాహాక సమావేశాలు
- సెంబర్ 9 రోజు మేడ్చల్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,మహానాడు: 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఏప్రిల్ 27, 2001 నాడు గులాబీ జెండాను ఎగరవేసిన నాయకులు కేసీఆర్. తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని మలుపు తిప్పి...తెలంగాణ ఉద్యమ చరిత్ర పై కేసీఆర్ అనే చెరిగిపోని సంతకం చేసిన మహానాయకులు కేసీఆర్. నవంబర్ 29, 2009 న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజని మన అందరికీ తెలుసు.

స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినం. ఆనాడు కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ తెచ్చుడో అని తెగువ కనబరిచిన నాయకుడికి 3 కోట్ల మంది ప్రజలు ముక్త కంఠంతో అండగా నిలబడ్డారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ రాజకీయ

మిగతా.. 2లో

# అదానీ.. జగన్.. ఆ 1750 కోట్లు!

ఆ అంకెలు ...సరదాగా ... అసలు స్టోరీ ఏంటంటే...

తెలుగు జనానికి మంచి కాలక్షేపం దొరికింది . ఏ నలుగురు ఒక చోట చేరినా ...., "చూశావా ? జగన్‌కు అదానీ 1750 కోట్లు ఇచ్చాడంట! అర్నీ...." అంటూ కాసేపు మాట్లాడుకుని, ఎవరి దారిని వారు పోవడానికి ఈ అంకెలు పనికి వస్తాయి.

జగన్ సంపాదనలో .... ఈ 1750 కోట్లు ఓ గుడ్డి వెంట్రుకతో సమానం అనేవాళ్ళు లేకపోలేదు.

సీబీఐ వాళ్ళు చచ్చీ చెడీ....భూతద్దాలు వేసుకుని వెదికితే, ఓ నలభై వేల కోట్ల ఆస్తులు 2012 లోనే దొరికాయి. అప్పటి నుంచి , అవి ఎన్ని చిలవలు, పలవలుగా పెరిగిపోయి ఉంటాయో చెప్పగలిగిన వారు ఎవరు !? డబ్బు విలువ జగన్ కు తెలుసు. ఎవరినైనా డబ్బుతో కొట్టడంలో ఆయన సిద్ధహస్తుడు అని కూడా అంటారు.



అందుకే , అప్పటి సీబీఐ జే డీగా పనిచేసిన వీ వీ లక్ష్మీనారాయణ ప్రాణాలకు తెగించి మరీ దాఖలు చేసిన 11 ఛార్జ్ షీట్లు ...డబ్బున్నవారి ఇళ్ళల్లో మునగడ దీసుకుని పడుకునుండే జర్మన్ షెపర్డ్ కుక్కల్లా మునగడ దీసుకుని ఎక్కడెక్కడో ...బీరువాల్లో పడుకుని ఉన్నాయి. ఇప్పటికి 12,13 ఏళ్లు అవుతున్నది.

ఆ డబ్బే లేకపోతే, ఆయనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి లభించి ఉండేది కాదు.

ముఖ్యమంత్రి పదవి లభించిన తరువాత బీ ఇక , "ఇంత" అని చెప్పగలిగిన వారు ఎవరు ? అందులో .... ఇప్పుడు అదానీ అనే అర్భకుడు ఇచ్చాడు అని మీడియా వాళ్ళు కాకిగోల చేస్తున్న 1750 కోట్లు ...ఆయన ఆర్థిక సముద్రం లో ఏ మూలకి!?

ఆ సముద్రంలో ఇదో కాకి రెట్ట.

జనానికి కాలక్షేపం కోసం ఏదో ఓ సొల్లు మాట్లాడుకోవడమే గానీ, జగన్‌కు గుడ్డి వెంట్రుక కూడా ఊడదు.


ఆయన అధికారంలో ఉన్నప్పుడే.... 2022 ఏప్రిల్ 8 న ఒకసారి

మిగతా.. 2లో

# 18 డిమాండ్లతో బీసీ రణభేరి మహా సభ

- కృష్ణయ్య వెల్లడి

హైదరాబాద్, మహానాడు: 18 డిమాండ్లతో బీసీ రణభేరి మహాసభ నిర్వహించ నున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ సభకు అన్ని పార్టీల నేతలను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు.



ప్రైవేట్ రంగంలోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి, చట్ట సభల్లో బీసీ లకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కేంద్రం చేపట్టబోయే జనగణనలో కుల గణన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

2
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 25, ఆగస్టు 2023 ||

## బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మహానాడు:**
డిసెంబర్ 21న ఉస్మానియా యూనివర్సిటీ లో జరిగే నిరుద్యోగ, ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలనకు కృతజ్ఞత బహిరంగ సభ పోస్టర్ను ఆవిష్కరించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.

ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీ జరిగింది. కేటీఆర్ కు నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతికత లేదు. 10 ఏళ్లలో పాలించి నిరుద్యోగులను పట్టించుకోలేదు. రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 54000 ఉద్యోగాల భర్తీ జరిగింది. తెలంగాణ యువత కోరుకున్న ప్రజా పాలన వచ్చింది నిరుద్యోగులకు కొత్త గా న్యూ ఇయర్ లో మరిన్ని ఉద్యోగాల భర్తీ జరుగుతది

స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో నిరుద్యోగులకు వరంగా మారబోతుంది

ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్,టీపీసీసీ రాష్ట్ర నాయకులు నూక కిరణ్ యాదవ్,టీపీసీసీ మీడియా కో ఆర్డినేటర్లు వచన్ కుమార్, శ్రీకాంత్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు చేడే మహేందర్,మల్లికార్జున కోట, దనుజయ్, ఓయు NSUI అధ్యక్షుడు: మెడ శ్రీను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.




## రాకెట్లను శ్రీహరి కోట నుంచే ఎందుకు ప్రయోగిస్తారు?

అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి దేశవ్యాప్తంగా పలు కేంద్రాలు ఉన్నాయి. తిరువనంతపురంలో ఉపగ్రహ తయారీ కేంద్రం, ఇతర కీలక విభాగాలు ఉన్నాయి.

శ్రీహరికోట ఎందుకంత ప్రత్యేకం?

హసన్, భోపాల్‌లలో రాకెట్లను నియంత్రించే మాస్టర్ కంట్రోల్ కేంద్రం.

హసన్,లఖ్‌నవూ,మారిషస్‌లలో శాటిలైట్ ఎర్త్ సెంటర్లు.

భూమధ్యరేఖకు దగ్గరగా ఉండటం రాకెట్ ప్రయోగాలకు శ్రీహరికోటను ఎంపిక చేయడానికి ప్రధానంగా 5 కారణాలు చెప్పుకోవచ్చు.అందులో ఒకటి భూమధ్య రేఖకు శ్రీహరికోట దగ్గరగా ఉండటం.ఇక్కడి నుంచి రాకెట్ ప్రయోగిస్తే పైసా ఖర్చు లేకుండా దానికి సెకన్‌కు 0.4 కిలోమీటర్ల అదనపు వేగం వస్తుంది.

భూభ్రమణం వల్ల రాకెట్‌కు గంటకు 1440 కిలోమీటర్ల అదనపు వేగం కలిసొస్తుంది. తూర్పు తీరంలో శ్రీహరికోట ఉంది.తూర్పు దిశ రాకెట్ ప్రయోగాలకు షార్ అనువైన ప్రాంతం. భూమధ్య రేఖకు శ్రీహరికోట సమీపంగా ఉంది.కౌరూ కేంద్రం తర్వాత అత్యంత అనువైన ప్రాంతం శ్రీహరికోటే.

భూపరిభ్రమణ వేగం భూమధ్య రేఖ వద్ద అధికం ధ్రువాల వద్ద భూపరిభ్రమణ వేగం అస్సలు ఉండదు!గంటకు 1,674 కి.మీ భూమధ్య రేఖ వద్ద భూమి వేగం. భూమి పశ్చిమం నుంచి తూర్పు దిశగా తిరుగుతోంది.రాకెట్ కూడా తూర్పు దిశగా ప్రయోగిస్తే, భూపరిభ్రమణ వేగం కారణంగా అది అదనపు స్పీడ్ అందుకుంటుంది.అందుకే ప్రపంచంలో ముఖ్యమైన రాకెట్ ప్రయోగ కేంద్రాలు అన్నీ భూమధ్య రేఖకు సమీపంగానే ఏర్పాటు చేశారు.

### సుదీర్ఘ తూర్పు తీరప్రాంతం!

రాకెట్ ఒక్కసారి గాల్లోకి లేచిన తర్వాత నేరుగా నింగిలోకే వెళ్తుందన్న గ్యారెంటీ లేదు.

సాంకేతిక కారణాలతో అప్పడప్పుడు రాకెట్‌లు గాడి తప్పి కూలిపోతూ ఉంటాయి. అలాంటప్పుడు ఆ రాకెట్ శకలాలు జనావాసాల మీద పడితే ప్రాణనష్టం జరుగుతుంది ఒకవైపు బంగాళాఖాతం మరోవైపు పులికాట్ సరస్సు. శ్రీహరికోట విస్తీర్ణం43,360 ఎకరాలు,సుమారు 50 కి.మీ శ్రీహరికోట తీరప్రాంతం.ఈ విషయంలో శ్రీహరికోట పూర్తి సురక్షితం. ఎందుకంటే దాని చుట్టూ నీరు ఉంది.

ఈ పరిసరాల్లో పెద్దగా జన సంచారంగానీ, ఇళ్లు కానీ లేవు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగినా.. రాకెట్ శకలాలు సముద్రంలో పడిపోతాయి. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం ఉండదు.

రోడ్డు, రైలు, జల రవాణా సదుపాయం రాకెట్ ప్రయోగాలకు పెద్ద పెద్ద యంత్రాలు, పరికరాలు అవసరం అవుతాయి. కొన్నింటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే రవాణాకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను రాకెట్ ప్రయోగ కేంద్రాల కోసం ఎంపిక చేస్తారు.

శ్రీహరికోట ఈ పరీక్షలో కూడా పాసైంది. శ్రీహరికోటకు రోడ్డు, రైలు, జల మార్గాలు అందుబాటులో ఉన్నాయి.శ్రీహరికోట నేషనల్ హైవే 5పై ఉంది.రైల్వే స్టేషన్ 20 కిలోమీటర్లు,

చెన్నై పోర్టు 70 కిలోమీటర్లు. ప్రయోగాలకు అనుకూల వాతావరణం రాకెట్ ప్రయోగాలకు వాతావరణం అనుకూలంగా ఉండాలి. ఎక్కువ వర్షపాతం ఉండకూడదు. ఎండలు మండకూడదు.

శ్రీహరికోటలో ఏడాది పొడుగునా సాధారణ వాతావరణమే ఉంటుంది. వర్షాలు, ఎండలు అతిగా ఉండవు. ఒక్క అక్టోబర్, నవంబర్‌లో మాత్రమే భారీ వర్షాలు కురుస్తాయి. మిగతా 10నెలలు ప్రయోగాలకు అనుకూల సమయమే.

### భూమి స్వభావం ముఖ్యమే!

రాకెట్ ప్రయోగం సమయంలో భూమి తీవ్రంగా కంపిస్తుంది. దాన్ని తట్టుకునేలా భూమి అత్యంత ధృడంగా ఉండాలి. శ్రీహరికోటలో భూమి రాళ్లతో అత్యంత ధృడంగా ఉంటుంది.

రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు శ్రీహరికోట ఒక ఆప్షన్ కాదు. భారత్‌కు ఉన్న అరుదైన అవకాశం.

శ్రీహరికోటను మించిన ప్రదేశం మరొకటి భారతదేశంలో లేదు. అందుకే ఇది'రాకెట్ ప్రయోగాల కోట' అయింది.నిజానికి అంతరిక్ష పరిశోధనా ప్రయోగ కేంద్రాన్ని మొదట కేరళలోని తుంబలో ఏర్పాటు చేశారు.తొలుత రాకెట్ల ప్రయోగ కేంద్రంగా ఉన్న తుంబ, తర్వాత పూర్తిస్థాయి రాకెట్ నిర్మాణ కేంద్రంగా మారింది.

- సేకరణ



## అదానీ.. జగన్.. ఆ 1750 కోట్లు!

**మొదటి పేజీ తరువాయి..**

జూన్ 27 న ఒకసారి " వీరెవరూ నా వెంట్రుక కూడా పీకలేరు ..." అని ప్రకటించారు . ఇప్పటికీ పీకలేరు. ఆ విషయం తెలిసిన జ్ఞానులు గనుకనే బీ తెలుగు దేశం వారు గానీ , జనసేన వారు గానీ , బీజేపీ వారు గానీ నోరు పారేసుకోలేదు .

ఎందుకంటే – డబ్బులు ఇచ్చింది అని అమెరికా వాళ్ళు చెబుతున్నది అల్లాటప్పా ఆదినారాయణ కాదు . అదానీ .

చూడ ముచ్చటగా , ముద్దు ముద్దుగా... బొద్దుగా ఉండే అదానీ కి జలుబు చేస్తే బీ మన ప్రధాని మోడీ కి తుమ్ములు వస్తాయి అంటారు , కాంగ్రెస్ వాళ్ళు. ఇద్దరూ.... "అవిభక్త " కవలలా అని ఆశ్చర్యపోతుంటారు, రాజకీయ విశ్లేషకులు .

అందువల్ల బీ జగన్ ను ఏమైనా అంటే , అదానీ ని అన్నట్టే . అంటే , ప్రధాని ని అన్నట్టే .

ప్రధాని ...అంటే బీజేపీ . అంటే , కూటమి లోని ఒక పార్టీని కూటమి వాళ్ళే విమర్శించినట్టు .

పైపెచ్చు , 1750 కోట్లు ఈరోజుల్లో రాజకీయం గా పెద్ద అమౌంట్ కూడా కాదు . ఆ చిల్లర పైసల కోసం అనవసరమైన రభస ఎందుకు అని కూటమి విజ్ఞులు భావించి ఉంటారు.

జగన్ గానీ , ఆయన ఆత్మ – సజ్జల రామకృష్ణారెడ్డి గానీ ...అందుకే స్పందించి ఉండరు, ఈ "చిల్లర పైసల పంచాయతీ" పై స్పందించడం తమ లెవెల్ కు చిన్నతనం అని .


నిజానికి , 100 కోట్ల లిక్కర్ స్కాం జరిగిపోయిందంటూ గుండెలు బాదుకుని బీ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ను , ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ను , కేసీఆర్ కూతురు కవితను , ఎం పీ మాగంటి శ్రీనివాస రెడ్డి కొడుకును , విజయసాయి రెడ్డి అల్లుడు తమ్ముడు శరత్ చంద్రారెడ్డి ని ... మరికొందరినీ మామిడికాయల్ని ముగ్గేసినట్టు తీహార్ జైల్లో నెలలు తరబడి మగ్గేసిన సీబీఐ గానీ , ఈ డీ గానీ , ఇన్ కమ్ టాక్స్ వాళ్ళు గానీ , జగన్ వైపు కన్నెత్తి చూడరు . చూస్తే , ఉద్యోగాలు పోతాయి . బూజుపట్టి , దమ్మిడీ కి పనికిరాకుండా పోతారు .

ఎందుకంటే , అదానీ – ప్రధాని కి ఆత్మ బంధువు . అంటే , బీజేపీ కి బంధువు .

మరి , అమెరికా వాళ్ళు అదానీ ని ఓపాలి పంపించమని మన కేంద్రప్రభుత్వాన్ని అడుగుతారా ?

అదే అసలైన ప్రశ్న . అడిగితే , మన ప్రభుత్వం ఏం చేస్తుంది ? అదో ఇంట్రెస్టింగ్ పాయింట్ .

న్యూయార్క్ కోర్టు అరెస్టు వారెంట్లు కూడా జారీ చేసింది కాబట్టి బీ అదానీ ఇండియా దాటి ఎక్కడికి వెళ్ళడం కుదరదు . ఎఫ్ బీ ఐ వాళ్ళు ఎగరేసుకు పోతారు . ఆసక్తికరమైన ఇన్ని "యవ్వారాలు " ఉంటే బీ 1750 కోట్లదేముంది!?



- భోగాది వేంకట రాయుడు

## ఉద్యమ చరిత్రపై కేసీఆర్ చెరిగిపోని సంతకం

**మొదటి పేజీ తరువాయి..**

వ్యవస్థను ఒప్పించి, మెప్పించి...కులాలకు మతాలకు అతీతంగా అందరినీ కలిపిన సందర్భం దీక్షా దివస్. అప్పుడున్న సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు ఛిద్రం అయ్యింది.

మళ్లీ ఈ రోజు అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అవే నిర్బంధాలు, అవే అణచివేతలు, అవే దుర్భర పరిస్థితుల నేపథ్యం కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కనిపిస్తున్నాయి. ఆనాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో నేడు మళ్లీ రెండు జాతీయ పార్టీల మెడలు వంచాల్సిన పరిస్థితి ప్రతి పౌరుని మీద ఉన్నది.

కాంగ్రెస్ కు అధికారం ఇస్తే తెలంగాణ మళ్లీ అదే అంధకారమనే పరిస్థితి వచ్చింది. ఒక్క వర్గం కాదు...సంపన్న వర్గాల నుంచి అట్టడుగు వర్గాల వరకు అందరూ బాధపడుతున్నారు. అందుకే దీక్షా దివస్ నుంచి స్ఫూర్తి పొంది...కాంగ్రెస్ కబంధ హస్తల నుంచి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడుకోవటానికి మరో సంకల్ప దీక్ష చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైంది.

స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని ప్రొఫెసర్ జయశంకర్ గారు తరుచూ చెప్పేది. ఈ రోజు ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని, ఆనాటి పాలనను కోరుకుంటున్నారు. దాని కోసం మా పార్టీ శ్రేణులు కలిసి కట్టుగా ముందుకు వెళ్లాల్సిన సందర్భం. నవంబర్ 29 న 33 జిల్లాల్లో మా పార్టీ కార్యాలయాల్లో ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నాం. తెలంగాణ పై కేసీఆర్ ఏ విధంగా చెరగని ముద్ర వేశారో మళ్లీ గుర్తు చేసుకుంటూ... రెండు జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు కదం తొక్కుతాం. 29 నవంబర్ రోజు పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కదం తొక్కాలని పార్టీ నేతలకు పిలుపు ఇస్తున్నాం. ఈ కార్యక్రమాల నిర్వహణకు అన్ని జిల్లాలకు సీనియర్ నాయకులను ఇంఛార్జ్ లుగా నియమించాం.

దీక్షా దివాస్ కార్యక్రమ నిర్వహణ కోసం ఈ నెల 26 న అన్ని జిల్లాల్లో సన్నాహాక సమావేశాలు నిర్వహిస్తాం. 29 నాడు దీక్షా దివస్ ఘనంగా నిర్వహించనున్నాం. కేసీఆర్ తన దీక్షను ముగించిన డిసెంబర్ 9 రోజు మేడ్చల్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం. మా పార్టీ నాయకులంతా ఆరోజు పెద్ద ఎత్తున ఉత్సవాలు చేస్తూ తెలంగాణ తల్లికి ప్రణమిల్లుతాం. కేసీఆర్ దీక్షలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర కూడా ఘనమైనది. ఆ రోజు నిమ్స్ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారింది.

అందుకే ఆ రోజు నిమ్స్ హాస్పిటల్ లో అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేసాం. దీక్షా దివస్ తో పాటు తెలంగాణ తల్లి విగ్రహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.ఆనాటి కార్యక్రమాలు, ఉద్యమ జ్ఞాపకాలను మళ్లీ గుర్తు తెచ్చే విధంగా మీడియా కూడా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. కేసీఆర్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో మళ్లీ రగిలించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఈ దుర్మార్గ కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

## జగన్-లోకేష్-షర్మిల... ఒక ప్రెస్‌మీట్.. మరో డిక్టేషన్!

మొదటి పేజీ తరువాయి..

ఐదేళ్లు సీఎం, మరో ఐదేళ్లు విపక్షనేతగా పనిచేసిన జగన్ మాత్రం ఇందుకు భిన్నం. మీడియాను చూస్తే పారిపోయే నైజం. విపక్షంలో ఉన్నప్పుడూ అదే శైలి. చివరకు ఆయన ప్రసంగాన్ని రికార్డు చేసి, దానినే ప్రెస్‌మీట్‌లా విడుదల చేస్తున్న వైచిత్రి. అందుకే ఆశ్చర్యం. కొత్తగా విపక్షపాత్ర పోషిస్తున్న జగన్ ప్రెస్‌మీట్లు డిక్టేషన్‌లా సాగుతున్నాయి. అంటే ఒక అధికారి తన స్టెనోకు డి క్టేషన్, నోట్స్ ఇస్తున్నట్లుగా జగన్ ప్రెస్‌మీట్ సాగుతోంది.

తాను చెప్పాల్సింది చెప్పడం. తర్వాత మీడియాకు ప్రశ్నలు వేసే అవకాశం ఇవ్వకుండా, చేతికి వాచీ చూసుకుని వెళ్లిపోవడం. ఏదైనా ప్రశ్న వేస్తే అది నచ్చితే చెప్పడం. లేకపోతే 'అవన్నీ ఇప్పుడు ఎందుకే అన్నా' అని వెళ్లిపోవడం. ఇంకా నెగటివ్ ప్రశ్నలు వేసేవారిని అలా చూసి వెళ్లిపోతుంటారు. తర్వాత జగన్ ఆఫీసు నుంచి.. ఆ ప్రశ్న వేసిన జర్నలిస్టు పనిచేసే మీడియా యజమానికి ఫోను వెళుతుంది. మీ రిపోర్టరు అన్నీ నెగటివ్ ప్రశ్నలు వేస్తున్నారు. ఇలాగైతే ఎలా? అధికారంలో ఉన్నప్పుడు మేం మీకు ఎంత చేశాం? రేపటి నుంచి అతడిని కాకుండా మరొకరిని పంపించండి అంటూ ఫోను వెళుతుంది. అదే ఇప్పుడు జగన్ మీడియా పట్ల అనుసరిస్తున్న నయా ట్రెండ్. వేసిన ప్రశ్నలకు నేర్పుగా, ధైర్యంగా జవాబిచ్చే ధైర్యం లేని జగన్.. ఈ ఐదేళ్లు మీడియాను ఎందుకు తప్పించుకుని తిరిగారో ఇప్పుడే అర్ధమవుతోందన్నది మీడియా వర్గాల ఉవాచ.

మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్.. తన మునుపటి శైలిని పూర్తిగా మార్చుకుని, పరిణతి చెందిన నేతగా కనిపిస్తున్న పరిస్థితి. ఒక వ్యక్తి రాటుతేలితే ఏ స్థాయిలో రాణించగలరన్న దానికి లోకేష్ ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

లోకేష్ పార్టీలో అధికారికంగా బాధ్యతలు చేపట్టకముందు, ఒక నాయకుడి కొడుకుగా పర్యవేక్షణకు పరిమితమయ్యారు. అప్పట్లో ఆయన తన పంజగుట్ట హెరిటేజ్ కార్యాలయం, తర్వాత హైదరాబాద్ పార్టీ ఆఫీసుకే ఎక్కువ పరిమితమయ్యేవారు. అయినప్పటికీ, పార్టీ పర్యవేక్షణపైనే ఎక్కువ దృష్టి సారించేవారు. ఇంట్లో కింద ఫ్లోర్ నుంచే సమాచార వ్యవస్థను విశ్లేషించే వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు.

ఎక్కువగా గ్రౌండ్ రిపోర్టుల మీదనే ఆధారపడి, తండ్రికి సూచనలిచ్చేవారు. అప్పటికి లోకేష్ మీడియాకు దూరంగానే ఉండేవారు. తండ్రితో సాన్నిహిత్యం ఉన్న కొంతమంది మాత్రమే, అప్పట్లో లోకేష్‌తో మాట్లాడేవారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తండ్రి రైతుదీక్ష చేసిన సందర్భంలో, పోలీసులు ఆయన దీక్ష భగ్నం చేసి దీక్ష చేసి, నిమ్స్‌కు తరలించారు. ఆ సమయంలోనే లోకేష్ తొలిసారి బయటకు వచ్చారు. తండ్రి ఆసుపత్రిలో ఉన్నన్ని రోజులు ఆ బ్లాక్‌లోనే ఆయన కూడా కనిపించేవారు.

ఇక అధికారికంగా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా, మీడియాతో పెద్దగా సంబంధాలు లేవు. ఎమ్మెల్సీగా ఎన్నికయి, మంత్రి అయిన తర్వాత కూడా మీడియాను పరిమితంగానే కలిసేవారు. తనకు పరిచయం ఉన్నవారితోనే మాట్లాడే



వారు. ప్రెస్‌మీట్లకూ దూరంగా ఉండేవారు. అసెంబ్లీ సమయంలో కూడా, మీడియాతో మాట్లాడేందుకు పెద్దగా ఇష్టపడేవారు కాదు. ఇంటర్వ్యూలు అడిగినా 'ఇప్పుడే వద్దులే బాస్' అని సున్నితంగా తప్పించుకునేవారు.

ఆ సమయంలో లోకేష్ కొన్ని సందర్భాల్లో చేసిన ప్రసంగాలు దారుణంగా ట్రోలింగ్‌కు గురయ్యేవి. లోకేష్ భయానికి బహుశా అది కూడా ఒక కారణం కావచ్చేమో?! ఇంగ్లీషు మీడియంలో చదువుకున్న లోకేష్‌కు.. అప్పట్లో తెలుగుపై పెద్దగా పట్టు లేకపోవడంతో, ఆయన మాటల్లో దొర్లే తప్పులను వైసీపీ సోషల్‌మీడియా దారుణంగా ట్రోల్ చేసి, ఆయనను పప్పుగా ముద్రవేసింది.

తర్వాత లోకేష్ రాటుతేలి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన వైనం ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా యువగళం పాదయాత్ర, లోకేష్‌ను ఒకనేతగా తీర్చిదిద్దేందుకు ఒక ప్రజావేదికయింది. అసలు ఒకప్పుడు మాట్లాడేందుకే భయపడిన లోకేష్... అదే యువగళం వేదికలపై నుంచి, నాటి జగన్ సర్కారుపై విసిరిన పంచ్‌లు వింటే ఆశ్చర్యపడక తప్పదు. భాష మార్చుకుని మీడియా ముందు ధైర్యంగా నిలబడి, ఎలాంటి ప్రశ్నలకయినా సమాధానాలిస్తున్న తీరు.. అంతకు ముందు ఆయన తీరు చూసిన వారిని సైతం ఆశ్చర్యానికి గురిచేసేదే. పాదయాత్రలు, జిల్లా పర్యటనల సందర్భంలో మీడియాను ఆయనే పిలిచి, ప్రశ్నలు అడగమన్న తీరు.. 'ఈయన అప్పటి లోకేషేనా' అని ఆశ్చర్యపరిచేదే.

పైగా అక్కడ ఉండే తమ పార్టీ ప్రత్యర్థి మీడియా విలేకరిని పిలిచి మరీ ప్రశ్నలు వేయమని చెప్పి, ర్యాగింగ్ చేసిన తీరు మరో అబ్బురం. అదే జగన్ 'మీ పేపర్‌ను మేం పిలవలేదు కదా? మీరు ఇక్కడకు ఎందుకొచ్చారు' నిర్మొహమాటంగా అడిగిన సందర్భాలు లేకపోలేదు. కానీ లోకేష్ మాత్రం అందుకు భిన్నంగా, సాక్షి–టీవీ9 రిపోర్టరును పిలిచి మరీ మాట్లాడటమే విశేషం. ఎక్కడా తడబడకుండా, తొట్రుపాటుకు గురికాకుండా మాట్లాడుతున్న తీరు చూస్తే.. జగన్ ఆయనను చూసి నేర్చుకోవాలనిపించక తప్పదు.

నిజానికి జగన్‌తో పోలిస్తే లోకేష్ రాజకీయ అనుభవం తక్కువే. జగన్ కడప ఎంపీగా కూడా పనిచేశారు. తర్వాత విపక్ష నేత, సీఎంగా పనిచేసినప్పటికీ జగన్‌కు ఇప్పటికీ మీడియా అంటే భయమే. లోకేష్ తండ్రి సీఎం అయినప్పటికీ, లోకేష్ మీడియా ముందుకొచ్చి మాట్లాడే అంశాలు అప్పట్లో లేవు. మంత్రిగా తాను ఎదుర్కొన్న ట్రోలింగ్ అవమానాల తర్వాతనే లోకేష్ బాగా రాటుతేలినట్లు కనిపించింది.

ఉమ్మడి రాష్ట్రం, విభజిత రాష్ట్రంలో లోకేష్‌ను చాలాసార్లు కలిసినప్పటికీ, ఇప్పటి ఆయనలోని పరిణతి ఎప్పుడూ చూడలేదు. చాలాకాలం తర్వాత లోకేష్‌ను కొద్దిరోజుల క్రితం కలిసిన సందర్భంలో, ఆయనలో తొణికిసలాడే ఆత్మవిశ్వాసం చూసి ఆశ్చర్యపోవలసి వచ్చింది.

అందరికీ అనుభవాలే పాఠాలు చెబుతాయంటే ఇదేనేమో?! కానీ ఈ అనుభవాలు జగన్‌కు మాత్రం, పాఠాలు.. కనీసం గుణపాఠాలుగా కూడా కాకపోవడమే విచిత్రం! లోకేష్ కూడా జగన్ మాదిరి ఇంగ్లీషు మీడియమే. కానీ ఆయనలా.. ఈయనిలా!

ఇక జగన్ చెల్లి– ఏపీపీసీసీ చీఫ్ అయిన షర్మిలది అన్నయ్యకు భిన్నమైన తీరు. షర్మిల కూడా ఇంగ్లీషు మీడియంలో చదివినా, తండ్రి వైఎస్ మాదిరి తెలుగు స్పష్టంగా మాట్లాడతారు. తెలుగు సామెతలు ఆమె మాటల్లో తరచూ దొర్లుతుంటాయి.

షర్మిల మాటలు విన్న వారికి, ఆమె తెలుగు మీడియంలో చదివారా అనిపిస్తుంటుంది.

ప్రెస్‌మీట్లలో ఏ ప్రశ్నకూ ఆమె తడుముకున్న దాఖలాలు కనిపించవు. అన్న జగన్ మాదిరిగా జర్నలిస్టులను 'మీరు ఏ మీడియా అన్నా' అని అడగరు. ఏ మీడియా అయినా సరే.. వేసిన ప్రశ్నకు తడుముకోకుండా జవాబు ఇచ్చేస్తారు.

ఆమె ప్రసంగం–మాటలు.. తండ్రిని ఇమిటేట్ చేస్తున్నట్లు కనిపించినప్పటికీ, జగన్‌తో పోలిస్తే ఆమెకే విషయ పరిజ్ఞానం ఎక్కువ. జగన్ ప్రసంగం చప్పగా ఉంటుంది. ఎక్కడా పంచ్‌లు ఉండవు. కానీ షర్మిల తీరు వేరు. ఆమె ప్రసంగంలో పంచ్‌లు అలా పడుతూనే ఉంటాయి. జగన్ స్పీచ్ కాపీ చూసి మాట్లాడతారు. స్పీచ్‌కాపీ లేకపోతే మాట్లాడలేరు. చాలాసార్లు చూసి కూడా తప్పులు దొర్లి, సోషల్‌మీడియాకు దొరికిపోయిన సందర్భాలు కోకొల్లలు. సీఎంగా ఉన్నప్పుడు ఆయన చేసిన ప్రసంగాలు, సగానికిపైగా ట్రోలింగ్‌కు గురైనవే కావడం గమనార్హం.

కానీ షర్మిల మాత్రం నోట్స్ చూడకుండానే మీడియాతో మాట్లాడతారు. జగన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌కు ముందు గంటకుపైగా ప్రిపేర్ అవుతారు. ఏకపాత్రాభినయంతో రిహార్సల్ చేస్తారు. కానీ షర్మిల మాత్రం నోట్స్ లేకుండా, పేపర్ చూడకుండానే ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతుంటారు. జగన్ ప్రసంగం ఎప్పుడు అయిపోతుందా అనిపిస్తే.. షర్మిల ప్రసంగం మాత్రం, అప్పుడే అయిపోయిందా అనిపిస్తుంటుందనేది నిర్వివాదం.

నిజానికి అన్న జగన్ అరెస్టుకు ముందు వరకూ షర్మిలకు రాజకీయాలపై ఏమాత్రం ఆసక్తి లేదు. పాదయాత్ర కూడా అన్న కోసం చేసిందే. అప్పటికి ఆమెకు 'రాజకీయభాష' గురించి ఏమాత్రం తెలియదు.


తెలుగుపై పెద్దగా పట్టు లేదు. అంతకు ముందు ఏ వేదికపైనా మాట్లాడిన అనుభవం కూడా లేదు. అనివార్యమైన పరిస్థితిలో బలవంతంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె, ఇప్పుడు ఏపీలో ఒక జనాకర్షణ నేతగా మారారు.

నిజంగా.. జగన్–భారతి తన బెంగళూరు నివాసంలో షర్మిలకు సూచించినట్లు... 'నేను రాజకీయాల్లో ఉంటా. నువ్వు వ్యాపారాలు చూసుకో' అని చెప్పినట్లుగా, ఆమెకు వ్యాపారాలు అప్పగించి ఉంటే, షర్మిల రాజకీయాల్లోకి వచ్చి ఉండేవారు కారేమో?! జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి.. ఆమెకు సాక్షి, భారతి సిమెంట్స్ వ్యాపారాలు అప్పగించి ఉంటే, పరిస్థితి మరోరకంగా ఉండేదేమో?! అందుకు భిన్నంగా వ్యవహరించి 'చెల్లిని కూడా మోసం చేశార'న్న పేరు తెచ్చుకున్నారు.

## ఎల్లప్పుడూ.. అందుబాటులో ఉంటాం

### రెడ్డి సంఘం వన సమారాధనలో రాష్ట్ర మంత్రి పొంగులేటి, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**మధిర,మహానాడు:**
ప్రజలందరికీ ఎల్లప్పుడూ.. అందుబాటులో ఉంటామని.. అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు.



మధిర తునికపాడు వద్ద మామిడి తోటలో ఆదివారం నిర్వహించిన రెడ్డి సంఘం వారి వనభోజనాలకు వీరు హాజరై.. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి వన సమారాధనలతో అందరిలో ఐక్యత పెరుగుతుందని, ఆరోగ్యకర వాతావరణం నెల కొంటుందని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా.. కాంగ్రెస్ పాలన సాగుతోందని.. అందరికీ అండగా ఉంటామని అభయమిచ్చారు.

డాక్టర్ కోటా రాంబాబు నివాసానికి..



రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మధిర లోని కాంగ్రెస్ జిల్లా నేత డాక్టర్ కోటా రాంబాబు నివాసానికి వెళ్లారు. అక్కడ తేనీటి విందు స్వీకరించి.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను కలుసుకున్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 25, ఆగస్టు 2023

కార్తీక మాసం సందర్భంగా పల్నాడు జిల్లా కొండమోడు సీతారాంపురంలోని సీతారామస్వామి వారి దేవాలయంలో 'పిడుగురాళ్ళ పట్టణ శ్రీకృష్ణదేవరాయ కాపు సేవా సమితి' ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు కార్తీక వన సమారాధన కార్యక్రమంలో గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ కాపు కల్యాణ మండపం నిర్మాణం ఏడాదిలోపు పూర్తి చేసే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. శ్మశాన వాటికకు సంబంధించి కాపు పెద్దలందరూ చర్చించుకుని, ఏ విధంగా ముందుకు వెళ్ళాలనే విషయాన్ని తన దృష్టికి తీసుకు వస్తే బరియల్ గ్రౌండ్ మంజూరుకు కూడా సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. కాపులకు రాజకీయంగా కూడా అండదండలు అందజేస్తానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మోదానీ - లంచం



"ఏవండీ నానిగాడికి 12 వేల రూపాయలు కావాలంట'! భోజనం వడ్డిస్తూ అన్నది లక్ష్మి.

ఆనందంగా భోజనం చేస్తున్న ప్రకాష్‌కి పొలమారింది. నీళ్ల కోసం సైగ చేశాడు. భార్య అందించిన నీళ్లు తాగి కొంచెంసేపు స్థిమిత పడ్డాడు!

"పన్నెండు వేలు కావాలని భోజనం టైములో చెబుతావా ఆ..రు!" అని కసురుకోబోయాడు ప్రకాష్, కానీ మళ్లీ పొలమారింది. ఈ సారి మోతాదు ఎక్కువైంది. భర్త అడగ కుండానే నీళ్లు తాపి, గుండెల మీద చేత్తో రాసింది. అప్పుడు కుదుటపడ్డాడు.

"మీ కొడుకు ఏదైనా కావాలంటే, భోజనం టైములోనే చెప్పమన్నారు కదా'! అన్నది లక్ష్మి చిరుకోపంతో.

"చాల్లాల్లే! ఏడోతరగతి చదువుతున్న బుడ్డ వెధవకి పన్నెండు వేలు ఎందుకు? ఆ ఫీజు, ఈ ఫీజులంటూ ఇప్పటికీ ఆ ప్రయివేటు స్కూలుకి మూడు లక్షల రూపాయలు నా రెక్కల కష్టం ధారబోశాను కదే! ఇంకా ఎక్కడి నుండి తెచ్చేది? అయినా అంత డబ్బు ఎందుకు? ఎక్స్‌కర్షన్‌కు ఏమైనా పోతున్నారా? నీవు కూడా దాచిపెట్టిన డబ్బులు దోచిపెట్టకు"! అన్నాడు ప్రకాష్ కరాఖండిగా!

"అబ్బా! అసలు మీ సుపుత్రుడు పన్నెండు వేలు ఎందుకడిగాడో తెలుసా?" అన్నది లక్ష్మి.

"నీవు చెప్పందే నాకెలా తెలుస్తుంది?" అంటూ లేచాడు ప్రకాష్.

"మార్కులు ఎక్కువగా రావాలని" నసిగిం దామె.

"ఆ మార్కులు ఎక్కువగా రావాలని" అంటూ రెట్టించాడు.

"క్వశ్చన్ పేపర్ లీక్ చేయడానికి ఎవడికో లంచం ఇస్తాడంట"! అన్నది లక్ష్మి.

ఈసారి కళ్లు తిరిగి కింద పడబోయి భార్య ఆసరాతో నిలదొక్కుకున్నాడు.

"ఏం మాట్లాడుతున్నావే?" అన్నాడు ప్రకాష్ అయోమయంగా.

"లంచం ఇవ్వటానికి పన్నెండు వేల రూపాయలు అడిగాడు. మీ నాన్న దగ్గర అన్ని డబ్బులు లేవు! అన్నాను. అప్పు తెచ్చి ఇవ్వమన్నాడు." అన్నది లక్ష్మి.

"అంత మాటన్నాడా. ఎక్కడ వాడు?" అన్నాడు ప్రకాష్ కోపంగా.

ఇంతలో నానిగాడు వచ్చాడు.

కొడుకును చూడగానే ప్రకాష్‌కి కోపం కట్టలు తెంచుకున్నది. ఒక్క ఉదుటన వెళ్లి కొడుకు చొక్కా కాలర్ పట్టుకున్నాడు.

"చంపేస్తాను వెధవా? క్వశ్చన్ పేపర్ కోసం లంచం ఇస్తావా?" అంటూ కొట్టబోయాడు, లక్ష్మి వెళ్లి కొడుకును విడిపించింది!

"చదువుకుని మార్కులు సంపాదించుకోవాలి గాని లంచమిచ్చి క్వశ్చన్ పేపర్ లీక్ చేయించు కోవటం ఏమిట్రా? అసలు ఇదెక్కడి ఆలోచన? ఎవరిని చూసి నేర్చుకున్నావురా?" అన్నాడు ఆగ్రహంతో ప్రకాష్.

"అదానీని చూసి నేర్చుకున్నాను!" అన్నాడు నానిగాడు కాలర్ సరిచేసుకుంటూ.

భార్యాభర్తలు ఇద్దరూ షాక్ తిన్నారు!

"ఏం మాట్లాడుతున్నావ్‌రా? నరాలు కట్ అయిపోయినయి!" అన్నాడు ప్రకాష్, అదేదో సినిమాలో హాస్య నటుడిలా.

"అవును! కరెంటు అమ్మటానికి రెండు వేల కోట్ల రూపాయలు ఆఫీసర్లకి అదానీ లంచం ఇచ్చాడని, టీవీల్లో, పేపర్లలో, మా స్కూలు వాట్సప్ గ్రూపులో కూడా వచ్చింది! నాకు మార్కులు తక్కువ వస్తున్నాయని ఎప్పుడూ నువ్ తిడుతుంటావు కదా డాడీ!" అన్నాడు నానిగాడు.

"ఏంట్రా నీవు మాట్లాడేది! నీకు, అదానీకి సంబంధం ఏమిటీ?" అన్నది లక్ష్మి కోపంగా.

"మమ్మీ అదానీలు, అంబానీలు ఎంతో గొప్పవారనీ, వారిని చూసి నేర్చుకోవాలనీ డాడీ ఎప్పుడూ చెబుతుండేవాడు నీకు గుర్తుందా?" అడిగాడు నానిగాడు.

"వేలెడంత లేవు! వెధవా! అదానీ, అంబానీలు ఎక్కడా? నీవెక్కడా? నీకూ వాళ్లకూ ఏమైనా సంబంధం ఉందా?" అంటూ మళ్లీ నానిగాడిని కొట్టబోయాడు.

"డాడీ నీవు చెప్పిందే ఫాలో అవుతున్నాను! నా మీద చేయి వేస్తే బాగుండదు!" అన్నాడు నానిగాడు తల్లి వెనక దాక్కుని.

"అంతా నీ వల్లే!" లక్ష్మి మీద గరుమన్నాడు ప్రకాష్.

"డాడీ! ఇందాకే చెప్పాను కదా! నీవు చెప్పిందే ఫాలో అవుతున్నానని, అయినా మమ్మీని ఎందుకు తిడతావు? నాకు భగత్ సింగ్, నేతాజీ, రంతిదేవుడు, సత్యహరిశ్చంద్రుడు లాంటి వాళ్ల కథలను మమ్మీ చెబుతుంటే, అలాంటి పాత చింతకాయ కథలు ఎందుకు చెబుతున్నావని తిట్టావు గుర్తుందా?" అడిగాడు నానిగాడు.

"అయితే ఏంటి?" అన్నాడు ప్రకాష్.

"భగత్‌సింగ్ లాంటి వాళ్ల కథలు వినటం మానేసి, నీవు చేప్పే ధీరూబారు అంబానీ, ముఖేష్ అంబానీ, గౌతం అదానీ లాంటి వాళ్లవి విన్నాను. నాలాంటి వాళ్లు అంబానీ, అదానీలను చూసి నేర్చుకోవాలని, వాళ్ల లాగా తయారు కావాలని నీవు చెప్పావు. అంతే కాదు, మోడీ తాత, అంబానీ, అదానీలతో ఉన్న ఫొటోలు కూడా చూపించావు! వారు ఈ దేశ ప్రజల కోసం ఎంతో సంపద సృష్టిస్తున్నారని మోడీ తాత కూడా అన్నారు. అందుకే నేను కూడా సంపద సృష్టించాలని, అందుకోసం ముందుగా ఎక్కువ మార్కులు సంపాదించాలని అనుకున్నాను.

అందుకే అదానీ ఇచ్చినట్లే నేను కూడా లంచం ఇవ్వటానికి పన్నెండు వేల రూపాయలే అడిగాను. డబ్బులు ఇవ్వు డాడీ!" అన్నాడు నానిగాడు. మాటలకు కళ్లు తిరిగి పడిపోయాడు ప్రకాష్!

"వాళ్లు సంపద సృష్టికర్తలు కాదురా నానిగా దేశ సంపదను బొక్కేవాళ్లు. ఆ అవినీతి తిమింగలాల గురించి తర్వాత చెప్తాగానీ ముందు మీ నాన్న సంగతి చూద్దాం రా" అంది కంగారుగా.

- ఫేస్‌బుక్ నుంచి సేకరణ



## మినీ అంగన్వాడీల సమస్యలను
# ప్రభుత్వం పరిష్కరించాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,మహానాడు:

మినీ అంగన్వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మినీ అంగన్వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ రోజు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను తెలంగాణ మినీ అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు.

సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మీ నేతృత్వంలో సమావేశమైన ఈ బృందం మినీ అంగన్వాడీల సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లింది.

సంఘం ప్రతినిధులు వివరించిన ప్రకారం, రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, ఈ ప్రక్రియ పూర్తిగా అమలులోకి రాలేదని తెలిపారు. జనవరి నెల నుండి మినీ అంగన్వాడీ టీచర్లకు ప్రధాన అంగన్వాడీ టీచర్లతో సమానంగా రూ.13,650 వేతనాలు చెల్లించడం ప్రారంభించినప్పటికీ, మార్చి నెల నుండి మళ్లీ పాత వేతనం రూ.7,800 మాత్రమే అందించడంలో అసమతుల్యత నెలకొంది.

దీనివల్ల మినీ అంగన్వాడీ టీచర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మినీ అంగన్వాడీ టీచర్లు ప్రధాన అంగన్వాడీ టీచర్లతో పోలిస్తే ఎక్కువ పనులు చేయాల్సి వస్తోందని, ఒక్కరే టీచర్‌గా ఉండి ఆహార పంపిణీ, పిల్లల సంరక్షణ, విద్యా కారక్రమాలు నిర్వహించడమే కాకుండా, బిఎల్ఓ డ్యూటీలు, సర్వేలు, పల్స్ పోలియో వంటి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంతైనప్పటికీ, హెల్పర్ పోస్టులు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయని, ఇది వారి పనిభారం మరింత పెంచిందని తెలిపారు.

కేంద్రాలకు సంబంధించిన బకాయిలు కూడా సమస్యలలో కీలకమని సంఘ ప్రతినిధులు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల రెంట్లు, కూరగాయల బిల్లులు, ఇతర ఖర్చులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సమస్యలు టీచర్ల జీవనశైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఈ విషయాలను వినిన కేటీఆర్, అంగన్వాడీ టీచర్లు మరియు మినీ అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాలను ప్రస్తావించి తగిన చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు మరియు మాజీ మంత్రులు కూడా హాజరై సమస్యలపై చర్చించారు.

అంగన్వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అర్థం చేసుకుని, సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కేటీఆర్ స్పష్టంచేశారు. మినీ అంగన్వాడీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు వేతనాలు సమానంగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# వన భోజనాలతో ప్రజల మధ్య మరింతగా సాన్నిహిత్యం

- మంత్రి కొండా సురేఖ

వరంగల్, మహానాడు:

ఖిలావరంగల్‌లోని చింతల్ గ్రౌండ్‌లో జరిగిన పద్మశాలి కార్తీక వనభోజన మహోత్సవానికి అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమ నిర్వాహకులు, ప్రజలు మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మంత్రి సురేఖని నిర్వాహకులు శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, పూర్వీకులు మన ప్రయోజనాలను కోరి అనేక ఆచారాలను, సంప్రదాయాలను ఏర్పరిచారని, సామూహిక జీవన విధానాన్ని అలవాటు చేసే వన భోజన కార్యక్రమం అలాంటిదేనని అన్నారు. వన భోజనాలకు వచ్చిన వారికి పేరుపేరునా మంత్రి సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. ఆ రోజుల్లో ప్రజలు ఆధ్యాత్మిక, సామాజిక ప్రయోజనాలను ఆశించి వన భోజనాలు జరుపుకునేవారని అన్నారు.

కానీ కాల క్రమంలో కులాల వారీగా వన భోజనాలు జరుపుకొనే ఆచారం వచ్చిందని తెలిపారు. ఒకరి కోసం అందరూ, అందరి కోసం ఒకరూ సహకరించుకుంటూ పోతే ప్రజల మధ్య సహృద్భావ సంబంధాలు పెంపొంది వసుదైక కుటుంబంగా వర్ధిల్లుతాతమనీని, సత్సంబంధాలు పెరిగి



ఉన్నతంగా ఎదగడానికి తోడ్పడుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. వన భోజనాలతో ప్రజల మధ్య సాన్నిహిత్యం పెరిగి, వైవాహిక సంబంధాలతో కుటుంబ బంధాలు మరింత బలపడతాయని మంత్రి అన్నారు. వన భోజనాల తర్వాత కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించుకోవడం అభినందనీయమని మంత్రి సురేఖ పేర్కొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత అని, విభజనలు లేకుండా పద్మశాలీలు అంతా ఐక్యంగా కొనసాగాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. గతంలో తాను పద్మశాలీల హక్కుల సాధనకు, పద్మశాలీ సంఘాలకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు పోరాటం పనిచేశానని, ఇదే ఒరవడిని కొనసాగిస్తున్నాని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. పద్మశాలి ఆడబిడ్డగా అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తనన ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన నిర్వాహకులకు మంత్ర ధన్యవాదాలు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం
- జగిత్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన కేసీఆర్
- అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదు
- పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్ ను ప్రజలు క్షమించరు
- జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో ఎమ్మెల్సీ కవిత
- బీసీ నాయకులతో ఎమ్మెల్సీ కవిత సమావేశం.. రేపు ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్ కు రిపోర్ట్ అందజేయనున్న ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్,మహానాడు:

భారత దేశ చరిత్రలోనే అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. బంజారాహిల్స్‌లోని నివాసంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్‌కు రిపోర్ట్ అందజేయనున్న నేపథ్యంలో, బీసీ సంఘాల నాయకులతోనూ ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు.

### జగిత్యాలతో ఆత్మీయ అనుబంధం

జగిత్యాలకు, నాకు ఆత్మయ అనుబంధం ఉందన్నారు ఎమ్మెల్సీ కవిత. 2014 లో నిజమాబాద్ ఎంపీగా తాను గెలిచినా, జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్ కుమార్ ఓడిపోయారని, కానీ పార్టీలకు అతీతంగా, వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసుకువాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా, అభివృద్ధిలో జగిత్యాల వెనకబడొద్దు అనే ఆదేశాలను కేసీఆర్ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే చిన్న జిల్లాలు ఏర్పాటు చేసుకోవాలి, చిన్న జిల్లాల ద్వారానే ఎక్కువ అభివృద్ధి జరుగుతుంది, గ్రామాల్లో ఉన్న ప్రతి పేద వ్యక్తికి కూడా తెలంగాణ సాధించిన ఫలితం అందుతుందని కేసీఆర్ తెలంగాణ ఉద్యమం రోజుల్లోనే చెప్పేవారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్, జగిత్యాల జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు, హైదరాబాద్ తరువాత ఎక్కువ సంఖ్యలో, 4,500 డబుల్ బెడ్ రూం ఇండ్లు జగిత్యాలకే కేటాయించి ప్రత్యేక శ్రద్ధ చూపెట్టారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

### నాయకులు పార్టీ మారినా.. కార్యకర్తలు పార్టీతోనే

ప్రస్తుతం పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్, అప్పుడు ఎమ్మెల్యే కాకపోయినా, పార్టీ ప్రతి కార్యక్రమంలో వేదిక పైకి తీసుకొచ్చి, కాబోయే ఎమ్మెల్యే అంటూ ఐదు సంవత్సరాల పాటు ప్రతి గ్రామంలో చెప్పామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఓడిపోయినా వదిలేయకుండా గౌరవంగా చూసుకుంటామనే సందేశం ఇచ్చిన సభ్యత గల పార్టీ బీఆర్ఎస్ అన్నారు ఎమ్మెల్సీ కవిత. ఆనాడు జగిత్యాల ఎమ్మెల్యేగా ఉన్న జీవన్ రెడ్డి ఎన్ని ఆకృత్యాలు, ఆఘాయిత్యాలు చేసినా, బీఆర్ఎస్ కార్యకర్తలంతా ముందుండి కొట్లాడారు కాబట్టే, జగిత్యాలలో గులాబీ జెండా ఎగిరిందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నాయకులు పార్టీలు మారినా, కార్యకర్తలు పార్టీలోనే ఉంటారని చెప్పడానికి మంచి ఉదాహరణ జగిత్యాల నియోజకవర్గం అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

### పార్టీ మారిన వ్యక్తులను ప్రజలకు క్షమించరు

ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీకి మారిపోయినప్పుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్తే అర్థముండేదని, కానీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా గోడ మీద పిల్లిలాగ ఉండటం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడం లాంటిదని ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. అలాంటి వ్యక్తులను ప్రజలు క్షమించరని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. ఎమ్మెల్యే పదవిని అడ్డు పెట్టుకోవడం పిరికితనమని, అలాంటి నాయకులు బీఆర్ఎస్ కు అవసరం లేదని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. గులాబీ జెండా అంటేనే గుండె ధైర్యం, గులాబీ జెండా అంటేనే ఉద్యమ పిడికిలి అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పిరికివాళ్లు, పదవుల వ్యామోహం ఉన్న వాళ్లు బీఆర్ఎస్ పార్టీకి అవసరం లేదన్నారు ఎమ్మెల్సీ కవిత.

### స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని, పార్టీ నుండి కార్యకర్తలకు, స్థానిక నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ కవిత భరోసానిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఎమ్మెల్యే పార్టీ మారారనే అంశంతో సంబంధం లేకుండా గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలని ఎమ్మెల్సీ కవిత ఆకాంక్షించారు.

### పది నెలల్లోనే ప్రజా వ్యతిరేకత

భారత దేశ చరిత్రలో అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోతోందని, వాళ్లు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా ప్రారంభించలేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, వైఫల్యాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు ఎమ్మెల్సీ కవిత.



### సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

ప్రతి గ్రామంలో వాట్సాప్ గ్రూప్‌లు, సోషల్ మీడియా సిద్ధం చేసుకోవాలని, కేసీఆర్ హయంలో ఎలా ఉంది, ప్రస్తుతం ఎలా ఉంది అనే అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు.

కరెంటు కోతలు, రైతు భరోసా, మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వకుండా ఎలా మోసం చేసారనే అంశాలను ఇప్పటినుండే చెప్పాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్సీ కవిత సూచించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలను తీసుకొని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జగిత్యాలలో మెజారిటీ సీట్లు గెలిచేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్సీ కవిత పార్టీ నేతలకు సూచించారు.

నీ కోసం తపించిన బిడ్డ కష్టాల్లో ఉండి, జైల్లో ఉన్నప్పుడు పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, రాజకీయాలకు మచ్చ తెచ్చారని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు, జెడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు

### బీసీ నాయకులతో ఎమ్మెల్సీ కవిత సమావేశం

బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. యునైటెడ్ ఫులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి మరియు బీసీ కుల సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్ కు ఎమ్మెల్సీ కవిత రిపోర్ట్ అందజేయనున్నారు. జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీసీ నేతలు గట్టు రాంచందర్ రావు, బొల్లా శివ శంకర్ , ఆలకుంట హరి, ఉపేందర్, మఠం భిక్షపతి, రాజారాం యాదవ్, దావ సురేష్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 25, ఆగస్టు 2023 ||

## అన్ని దానాల్లో అన్నదానం గొప్పది


● దేగల ప్రభాకర్

**గుంటూరు, మహానాడు:** అన్నదానం అన్ని దానాల్లోకల్లా అత్యంత గొప్పదని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ గుంటూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన అన్నపూర్ణ ఆహార పథకం కార్యక్రమాన్ని ప్రభాకర్ ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్నదానం చేయడం దైవకార్యంతో సమానమని ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా సేవా కార్యక్రమాలను చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ వారు వివిధ రకాల సేవా కార్యక్రమాలతో నిత్యం ప్రజల మధ్య ఉండడం అభినందనీయమన్నారు.




ఈ కార్యక్రమంలో లైఫ్టైమ్ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు సాతులూరు ప్రకాశరావు, అన్నపూర్ణ పథకం చైర్మన్ పతి వెంకట నారాయణ, బచ్చు గణేష్, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకట శ్రీనివాసరావు, గౌరవ చైర్మన్ మట్టుపలి శ్రీనివాస్ శరణ్, నేరెళ్ల శ్రీనివాసరావు, మేకల బాబురావు, నిశంకరరావు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



### 50 వసంతాల రాజమండ్రి

## రోడ్ కం రైల్వే బ్రిడ్జ్

**రాజమండ్రి,మహానాడు:**

ఉభయ గోదావరి జిల్లాలకు మణిహారంగా నిలిచిన రాజమండ్రి రోడ్ కం రైలు బ్రిడ్జి 50 వసంతాలను పూర్తి చేసుకుంది.. 1974లో ప్రారంభోత్సవం జరుపుకున్న ఈ బ్రిడ్జి 50 ఏళ్లుగా సేవలందిస్తోంది. ఆసియా ఖండం లోనే అతి పొడవైన రెండో రోడ్ కం రైల్వే బ్రిడ్జి ఇది.. ఈ బ్రిడ్జ్ పొడవు రైలు మార్గం 2.8 కి.మీ, రోడ్ మార్గం 4.1 కి.మీ. 1974 నవంబరులో అప్పటి రాష్ట్రపతి ఫ్రకుద్దీన్ ఆలీ అహ్మద్ ఈ బ్రిడ్జిని ప్రారంభించారు..

### మహారాష్ట్ర అసెంబ్లీలో కూడా

## ప్రతిపక్ష నేత లేనట్లే

**మహారాష్ట్ర, మహానాడు:**

ఏదైనా పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కాలంటే అసెంబ్లీ లోని మొత్తం సీట్లలో 10% గెలుచు కోవాలి.. దేశంలో ప్రతిపక్ష హోదా కూడా సంపాదించ లేని పార్టీలు ఉన్న రాష్ట్రాలు మహారాష్ట్రతో కలిపి 7 రాష్ట్రాలు ఉన్నాయి.మహారాష్ట్రలో 288 సీట్లకు గాను 29 సీట్లలో విజయం సాధిస్తే ప్రతిపక్ష హోదా ఇస్తారు. మహా వికాస్ అఘాడీలోని ఏ పార్టీకి అన్ని సీట్లు రాలేదు. శివసేన (UBT) - 20, కాంగ్రెస్ -16, NCP (శరద్ పవార్) -10 స్థానాలు మాత్రమే గెలిచాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, అరుణాచల్, గుజరాత్, మణిపుర్, నాగాలాండ్, సిక్కింలలో ప్రతిపక్ష నేతలు లేరు.

### నిరుపేద వికలాంగ విద్యార్థికి

## హాస్టల్ ఫీజు చెల్లించిన కేటీఆర్

**హైదరాబాద్,మహానాడు:**

తొర్రూర్ మండలం నాంచారి మదూర్ గ్రామానికి చెందిన గిద్దే విష్ణు తన చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకొవడం జరిగింది. పదో తరగతి పూర్తి చేసుకున్న విష్ణు కంప్యూటర్ శిక్షణ తీసుకోవడం కోసం





హైదరాబాద్ గాంధీనగర్ లో ప్రైవేట్ హాస్టల్ లో ఉండడం జరుగుతుంది హాస్టల్ ఫీజు చెల్లించే స్తోమత లేకపోవడంతో ఈరోజు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ని కలిసి తన సమస్యను తెలపడం జరిగింది.

దీనికి తక్షణమే స్పందించిన కేటీఆర్ విష్ణు కోచింగ్ పూర్తి అయ్యేవరకు హాస్టల్ ఫీజును చెల్లిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. తన సమస్యను తెలుపగానే స్పందించి సహాయం చేసిన కేటీఆర్ గారికి ఈ సందర్భంగా విష్ణు కృతజ్ఞతలు తెలియజేశాడు.

## పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చైనా చేస్తుంది

● పరిటాల సునీత

**రాప్తాడు, మహానాడు:** పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. మొత్తం 15మందికి 11.10లక్షల రూపాయల



చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య ఖర్చులతో అప్పుల భారంలో ఉన్న తమను ఆదుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ రోజు డబ్బు గురించి ఆలోచించలేదన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన వారికి ఆర్థికంగా ఆదుకుంటున్నట్టు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ కింద వారికి ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు.

పార్టీలతో సంబంధం లేకుండా ఇలాంటి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తున్నారని సునీత అన్నారు. ఎవరైనా సరే అర్హత ఉండి.. చికిత్సలకు సంబంధించిన బిల్లులు సమగ్రంగా అందిస్తే.. కచ్చితంగా సాయం అందుతుందని సునీత భరోసా ఇచ్చారు.

# జిల్లేడుబండ రిజర్వాయర్ భూ సేకరణకు నిధులివ్వండి

- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ ఆగిన పనులు
- తొలి దశ భూ సేకరణ కోసం రూ.93.59 కోట్లు కావాలి
- రికార్డ్ సమయంలో పనుల పూర్తికి సిఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు
- రిజర్వాయర్ ఏర్పాటుతో తీరనున్న తాగు, సాగు, పారిశ్రామిక నీటి అవసరాలు
- పెద్ద ఎత్తున ప్రత్యక్ష , పరోక్ష ఉపాధి అవకాశాలు
- జల వనరుల శాఖా మంత్రి రామానాయుడుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ లేఖ

**అమరావతి,మహానాడు:**

ధర్మవరం నియోజకవర్గం పరిధిలోని జిల్లేడుబండ రిజర్వాయర్ (JBR) ప్రాజెక్టు భూ సేకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లో తాగు, సాగునీటిని సరఫరా చేసే ఈ ప్రాజెక్టు కోసం గతంలో ఆగిన పనుల్ని తిరిగి ప్రారంభమయ్యేలా చూడాలని ఆయన తన లేఖలో విజ్ఞప్తి చేశారు. మొదటి దశ భూ సేకరణ పూర్తి చేసేందుకు రూ.93.59 కోట్ల పెండింగ్ నిధుల్ని విడుదల చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు, మంత్రి నిమ్మల రామానాయుడుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ లేఖ రాశారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్యేగా లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లేడుబండ రిజర్వాయర్ ప్రాజెక్ట్ కోసం అవసరమైన భూమి 3,378 ఎకరాలు కాగా, అందులో 2,790 ఎకరాల సేకరణ వివిధ దశల్లో ఉందని వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ భూ సేకరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని లేఖలో పేర్కొన్న శ్రీ సత్య కుమార్ యాదవ్, ఆగిన పనులను రికార్డు సమయంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎన్నికల ప్రచారంలో నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని



గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ప్రకారం, భూమి సేకరణ, ప్రాజెక్టు నిర్మాణాలు తిరిగి ప్రారంభమయ్యేలా చూడాలని మంత్రి రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం అత్యంత కరవు పీడిత ప్రాంతాల్లో ఒకటని గుర్తు చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్ తాగు, సాగునీటి అవసరాలు తీరక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లేడుబండ రిజర్వాయర్ ఏర్పాటుతో తాగు, పారిశ్రామిక నీటి అవసరాలు మాత్రమే కాదని, ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరం మండలాల్లోని 23 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు అందుతుందని వివరించారు. జిల్లేడుబండ రిజర్వాయర్ను పూర్తి చేయడం ధర్మవరం నియోజకవర్గానికి చిరకాల స్వప్నమని వెల్లడించారు. ఇప్పటికప్పుడు పనులు ప్రారంభించినా లక్ష్యాన్ని చేరుకోవడానికి కనీసం రెండేళ్లు పడుతుందని లేఖలో పేర్కొన్నారు.

జిల్లేడుబండ రిజర్వాయర్ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పన జరుగుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ వివరించారు. రిజర్వాయర్ ఏర్పాటు ద్వారా అభివృద్ధి చేసే పారిశ్రామిక హబ్ ఎంతటి కీలకమో వివరించే కొన్ని ప్రధానాంశాల్ని తన లేఖలో ఆయన ఉదహరించారు. జెబిఆర్ ప్రాజెక్టు అనంతపురం-కదిరి-తిరుపతి-చెన్నై హైవేకి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉంటుందని వెల్లడించారు.



ధర్మవరం-రేణిగుంట సెక్షన్లో ఉన్న ముదిగుబ్బ రైల్వే స్టేషన్కు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవాడ-బెంగళూరు గ్రీన్ఫీల్డ్ ఎక్స్ప్రెస్వేలోని మొలకలవేముల ఇంటర్చేంజ్కు సమీపంలో ఉందని లేఖలో పేర్కొన్నారు. కదిరి-ముదిగుబ్బ-బత్తలపల్లి ప్రాంతాల మధ్య భారీ బంజరు భూములు అందుబాటులో ఉన్నాయని తెలిపిన మంత్రి సత్యకుమార్ ఈ ప్రాంతానికి మెరుగైన అనుసంధానత ఉన్నందున పారిశ్రామిక హబ్ అభివృద్ధికి అత్యంత అనుకూలమైనదని తెలిపారు.

ప్రతిపాదిత కడప-ముద్దనూరు-ముదిగుబ్బ-బెంగుళూరు రైల్వే లైన్ పనులు ప్రారంభమైతే ఈ ప్రాంతానికి మరింత అనుసంధానత అందుబాటులోకి రావడంతో పాటు బాగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం అన్ని రకాల వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉన్నందున, రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరా చేస్తే ఉద్యాన పంటలు పెరిగే అవకాశాలున్నాయని తన లేఖలో మంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు.

ఇది ప్రజల ఆదాయ మార్గాల్ని, జీవన ప్రమాణాల్ని మెరుగు పరుస్తుందని లేఖలో రాశారు. రిజర్వాయర్లో నీటి నిల్వ వల్ల ఈ ప్రాంతంలో ఆక్వాకల్చర్కు కూడా ప్రయోజనం చేకూరుతుందని మంత్రి నిమ్మల రామానాయుడుకు రాసిన లేఖలో మంత్రి సత్య కుమార్ వివరించారు.

# పిల్లల్ని వదల్లేదు... వీరికి బకాయిలు రూ.6,500 కోట్లు!

- గన్ ఎక్స్లోని రాతలపై వాస్తవాలతో మంత్రి లోకేష్ కౌంటర్


**అమరావతి, మహానాడు:**



చిన్న పిల్లల చిక్కీ డబ్బులు సైతం ఎగ్గొట్టింది జగన్ ప్రభుత్వమని, గుడ్లు, చిక్కీలు మొదలుకొని ఫీజు రీ యింబర్స్మెంట్ బకాయిల వరకూ మీరు నా నెత్తిన పెట్టి పోయిన బకాయిలు అక్షరాలా రూ.6,500 కోట్లు. ఫీజు మొత్తం కడతానని చేతులెత్తేసిన చెత్త పాలన మీది. ఫీజు రీ యింబర్స్మెంట్ పథకాన్ని మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఫుట్ బాల్ ఆడుకుంది మీరు అని మంత్రి లోకేష్ జగన్ను విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతా రాహిత్యంగా ఉండి ప్రతిపక్షంలోకి రాగానే విలువలు వల్లించడం మీకే చెల్లింది సుప్పినిప ysjagan గారు అని ఎక్స్ వేదికగా స్పందించారు.

విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టి మోసం చేసిన కారణంగానే సర్టిఫికెట్లు రాక లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. నేను యువగళం పాదయాత్ర చేసేటప్పుడే మీ నిర్వాకాన్ని విద్యార్థులు నా దృష్టికి తెచ్చారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విషయాన్ని సీరియస్గా తీసుకొని సమస్య పరిష్కరించాం. గత ప్రభుత్వ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని, విద్యార్థుల సర్టిఫికెట్లను తక్షణమే అందజేయాల్సిందిగా కళాశాలలను ఆదేశించాం. ఇకపై ఫీజు రీ యింబర్స్ మెంట్ సొమ్మును నేరుగా కళాశాలలకు చెల్లించేలా ఇటీవలే నిర్ణయం కూడా తీసుకున్నాం.

అర్థరాత్రి ఆత్మలతో మాట్లాడి ఉదయం నిర్ణయాలు తీసుకుని



Lokesh Nara @naralokesh · 3m

1. చిన్న పిల్లల చిక్కీ డబ్బులు సైతం ఎగ్గొట్టిన సుప్పుని తాను సుద్దపూసని అనడం విచిత్రంగా ఉంది @ysjagan గారు! గుడ్లు, చిక్కీలు మొదలుకొని ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల వరకూ మీరు నా నెత్తిన పెట్టి పోయిన బకాయిలు అక్షరాలా రూ. 6,500 కోట్లు. ఫీజు మొత్తం కడతానని చేతులెత్తేసిన చెత్త పాలన Show more

YS Jagan Mohan Reddy @ysj... · 3h

1.@ncbn గారి కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులను పిల్లల చదువులకు చెల్లించకపోవడంతో చదువులు మానుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. చంద్రబా...

సాక్షి

...చెల్లిస్తేనే కాలేజీకి రా..!

| ...ed date | Number of beneficiaries | Amount rele... (in Cr) |
|---|---|---|
| .2020 | 21,55,298 | 4,208.25 |
| .2021 | 10,87,998 | 671.03 |
| .2021 | 10,96,844 | 693.27 |
| .2021 | 11,05,038 | 692.33 |
| .2022 | 10,82,100 | 694.82 |
| .2022 | 10,85,225 | 709.00 |
| .2022 | 11,01,800 | 693.73 |
| .2022 | 12,29,076 | 693.73 |
| .2023 | 9,86,092 | 684.52 |
| .2023 | 9,95,355 | 702.99 |
| .2023 | 7,67,582 | 680.44 |
| .2023 | 8,09,039 | 583.89 |
| -2024 | 9,44,666 | 708.68 |
| -2022 | Biannual sanctions | 193.00 |

గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. మీ అనాలోచిత, అవినీతి విధానాల కారణంగా గత ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో నాలుగు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయిన విషయం వాస్తవం కాదా? ఉపాధ్యాయులు, విద్యార్థులను సిద్ధంగా చెయ్యకుండానే సీబీఎస్ఈ పరీక్షా విధానం తీసుకొచ్చారు. మేం అధికారంలోకి వచ్చాక సీబీఎస్ఈ పరీక్షా విధానంలో నిర్వహించిన పరీక్షల్లో 90 శాతం మంది ఫెయిలయ్యారు. నీ నిర్ణయాలు బ్లైండ్గా ఫాలో అయితే ఆ పిల్లలు అంతా బోర్డు పరీక్షల్లో తప్పి డిప్రెషన్లోకి వెళ్లేవారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంచకుండా, టోఫెల్, ఐబీ శిక్షణ ఇచ్చేవారు లేకపోయినా అమలు చేశామని డబ్బా కొట్టుకోవడం... ఇలా ఒక్కటేంటి విద్యా వ్యవస్థను నాశనం చేసిన పాపం మీదే జగన్ గారు అని అన్నారు. నాడు - నేడు అంటూ పబ్లిసిటీ పీక్కు తీసుకెళ్లారు కానీ విషయం వీక్ అని తేలింది. నా క్షేత్రస్థాయి పర్యటనల్లో కనీసం పిల్లలు కూర్చోడానికి బల్లలు, మంచినీరు, టాయ్ లెట్లు లేని పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. ఇక ట్యాబులు ఇంటికి ఇవ్వడం వలన జరుగుతున్న అనర్థాలను మీరు నేరుగా తల్లితండ్రులను అడిగి తెలుకోవచ్చు. అందుకే మేం స్కూళ్లలోనే పిల్లల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

రాష్ట్రంలో గత ఐదేళ్లలో మీ వల్ల భ్రష్టు పట్టిన విద్యారంగాన్ని గాడిన పెట్టడం మా బాధ్యత. మీరు చేసిన విధ్వంసాన్ని ఒక్కొక్కటిగా సరిచేస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టులను మెగా డిఎస్సీతో భర్తీచేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం.

విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా విద్యాదీవెన, వసతిదీవెన స్థానంలో పాత ఫీజు రీ యింబర్స్ మెంట్ పథకాన్ని అమలు చేసి తీరుతాం. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు భ్రమింపజేసే కనికట్టు విద్యలో మాస్టర్స్ చేసిన మీకు విద్యారంగంలో మేం చేస్తున్న మంచిపనులు కన్పించకపోవచ్చు. ఎవరేమనుకున్నా రాబోయే ఐదేళ్లలో ఏపీ విద్యారంగాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం సంకల్పించింది. మీలాంటి మారీచులు ఎంత తప్పుడు ప్రచారం చేసినా విద్యారంగ సంస్కరణల విషయంలో మా అడుగు ముందుకే!

# అమరావతిలో భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- గుంతకల్లులో కనకదాసు కాంస్య విగ్రహ ఆవిష్కరించిన మంత్రి
- తిరుపతిలో కనకదాస పీఠం ఏర్పాటుకు కృషి
- టీడీపీతోనే కురబలకు రాజకీయ ప్రాధాన్యం : మంత్రి

**గుంతకల్లు,మహానాడు:**

మరావతిలో భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖమంత్రి ఎస్.సవిత తెలిపారు. తిరుపతిలోనూ భక్త కనకదాస పీఠం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గుంతకల్లు





పట్టణంలో భక్త కనకదాసు కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి సవిత ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస తన కీర్తనలు, రచనలతో సమాజంలో అసమానతులపైనా, కుల వ్యవస్థపైనా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు కనకదాస చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. అటువంటి మహనీయుని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఆ విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం తన అదృష్టమన్నారు.

కనకదాస వారసులవ్వడం కురబలు చేసుకున్న అదృష్టమన్నారు మాట ఇస్తే మాట తప్పని నైజం కురబలదన్నారు. ఒకప్పుడు పాలకులుగా వెలిగిన కురబలు ఆర్థిక నిర్వహణలోనూ నిష్ణాతులన్నారు. అన్ని రంగాల్లోనూ తమదైన ముద్రవేస్తున్న కురబలు విద్యాపరంగానూ ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. కురబ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాల కింద రుణాలు మంజూరుచేయనున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆమె కోరారు.

### టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం

కురబల రాజకీయ అభివృద్ధికి ఆవిర్భాం నుంచి టీడీపీ ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. గతంలో అన్న ఎన్టీఆర్, ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు కురబలకు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. గడిచిన ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం



జిల్లాలో రెండు ఎంపీ టిక్కెట్లు, ఒక ఎమ్మెల్యే టిక్కెట్ తో పాటు మంత్రి వర్గంలో కూడా స్థానం కల్పించారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుంతకల్లులో కురబలకు ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కు మంత్రి సవిత కోరారు.

### అమరావతిలో కనకదాస విగ్రహం

అమరావతిలో భక్త కనకదాస విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. తిరుపతిలో భక్త కనకదాస పీఠం ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ముఖ్య మంత్రి సీఎం చంద్రబాబునాయుడు కలిసి అమరావతిలో భక్త కనకదాస విగ్రహానికి స్థలం కేటాయించాలని కోరగా, అందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారన్నారు.

తిరుపతిలో కనకదాస పీఠం ఏర్పాటుకు పీఠాధిపతి నుంచి అనుమతి తీసుకుంటే, స్థలం మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అంతకుముందు కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మంత్రి సవిత జ్యోతి ప్రజల్వనచేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, సీపీఐ నాయకులు జగదీష్, రాష్ట్ర, జిల్లా కురుబ సంఘం నాయకులు కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 25, ఆగస్టు 2023

**మండపేట,మహానాడు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆంచనాల కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ పి గన్నవరం నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ శ్రీ నామన రాంబాబు జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్ శ్రీ నల్లిమిల్లి వీర్రెడ్డి నిమ్మకాయల శేషు మరియు నాయకులు కార్యాకర్తలు.



# డేటా ఎంట్రీ కీలకమైనది

- డోర్ లాక్, వలసలు వారి వివరాలను సేకరించండి
- రాంచీ నుంచి ఉన్నతాధికారులు, కలెక్టర్లతో సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం



**రాంచీ,మహానాడు:** సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుంది, డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమైనది.. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకండి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన జార?ండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లుకు పలు సూచనలు చేశారు. డేటా ఎంట్రీ లో నాణ్యత చాలా ముఖ్యమైనది,

ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తేయి కాబట్టి వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమబద్ధకరించుకోవాలని, వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్దరీకరించుకోవాలి అని తెలిపారు.

కొన్నివసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి. ఈ పాఠశాలలో ఆహారం మరియు పరిశుభ్రతపై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ రకమైన సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం, జిహెచ్ఎంసి కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.



# అడిగిందే తడవుగా సీఎం సహాయ నిధి నుంచి సాయం

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:** రాష్ట్రంలో పేదలు, అవసరంలో ఉన్న వారు అడిగిందే తడవుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సీఎం చంద్రబాబు సాయం అందిస్తున్నారని చీఫ్ విప్, విను కొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం వినుకొండ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. చికిత్సల కోసం సీఎంఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న 47మంది లబ్ధిదారులకు రూ. 92 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సంద ర్భంగా జీవీ మాట్లాడారు. 2014-19లో సీఎం చంద్రబాబు ఉన్నప్పుడు ఐదేళ్లలో వినుకొండ నియోజకవర్గంలో2,842 మందికి, రూ. 11.78 కోట్లమేర సీఎంఆర్ఎఫ్ సాయం చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీలో బిల్లులు రాక రోగులను వెనక్కి పంపించిన ఉదంతాలు చూశామన్నారు.

కూటమి ప్రభుత్వంలో తర్వాత సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడే బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుంటూరు సాంబశివరావు, నలబోలు రామకోటేశ్వరరావు, ఎర్రమాస కోటేశ్వరరావు, గోరంట్ల హనుమంత రావు, పీవీ సురేష్ బాబు, బీజేపీ నాయకులు మేడమ్ రమేష్, పువ్వాడ వెంకటకృష్ణ, మద్దుకూరు రాంబ్రహ్మం, సోమేపల్లి బ్రహ్మయ్య, మాదాల చిరంజీవి, చల్లా ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు
# 'టి-సాట్' జనరల్ స్టడీస్ ఫర్ ఆల్

- ఐదు నెలలు, 600 ఎపిసోడ్స్ పోటీ పరీక్షల పాఠ్యాంశాలు
- ప్రతి రోజూ రెండు గంటల ప్రత్యేక ప్రసారాలు
- ఈ నెల 25వ తేదీ సోమవారం నుండి ప్రారంభం
- సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి



**హైదరాబాద్,మహానాడు:** తెలంగాణ నిరుద్యోగ యువతకు టి-సాట్(తెలంగాణ స్కిల్ అకడమిక్ ట్రైనింగ్) నెట్వర్క్ అనునిత్యం అండగా నిలుస్తోంది. పోటీ పరీక్షలు ఏవైనా...వాటికి యువతను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది. ఆ ప్రయత్నంలో భాగంగానే 'జనరల్ స్టడీస్ ఫర్ ఆల్' పేరుతో అన్ని పోటీ పరీక్షలకూ ఉపయోగపడే కంటెంట్ ఈ నెల 25వ తేదీ సోమవారం నుండి ప్రసారం చేయాలని నిర్ణయించినట్లు టి-సాట్(తెలంగాణ స్కిల్ అకడమిక్ ట్రైనింగ్) సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకూ కంటెంట్ అందిస్తున్న టి-సాట్(తెలంగాణ స్కిల్ అకడమిక్ ట్రైనింగ్) నెట్వర్క్ కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వహించే పోటీ పరీక్షలకు ఎల్లవేళలా పోటీ పరీక్షల కంటెంట్ అందించిన ఏకైక సంస్థగా పేరుతెచ్చుకుందని వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

పోటీ పరీక్షల అవగాహన పాఠ్యాంశాల ప్రసారాల్లో భాగంగా ఆధునిక సాంకేతిక పరి జ్ఞానంతో కూడిన సుమారు 600 ఎపిసోడ్స్ 10 సబ్జెక్టులకు సంబంధించి 500 రోజులు కంటెంట్ ప్రసారం చేస్తున్నామని సీఈవో ప్రకటించారు. టి-సాట్(తెలంగాణ స్కిల్ అకడమిక్ ట్రైనింగ్) నిపుణ ఛానల్ లో మధ్యాహ్నం 12 నుండి ఒంటి గంట, మూడు నుండి నాలుగు గంటల వరకు, విద్య ఛానల్ లో అదే రోజు రాత్రి ఎనిమిది నుండి 10 గంటల వరకు పున:ప్రసారమౌతాయన్నారు. పోటీ పరీక్షల్లో ప్రధాన సబ్జెక్టులైన తెలంగాణ ఉద్యమం, ఇండియన్ హిస్టరీ, మ్యాథ్స్, జాగ్రఫీ, పాలిటీ వంటి సబ్జెక్టులతో పాటు సోషల్ ఎక్స్ క్లూజన్, జనరల్ ఇంగ్లీష్ వంటి ప్రత్యేక సబ్జెక్టులకు సంబంధించిన కంటెంట్ ప్రసారం చేస్తున్నామని సీఈవో వివరించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన తాము చేస్తున్న ఈ ప్రయత్నాలు విజయవంతం కావాలంటే పోటీ పరీక్షలకు హాజరయ్యే యువత తాము ప్రసారం చేసే పాఠ్యాంశాలను సరైన విధంగా ఉపయోగించుకోవాలని సూచించారు.


టి-సాట్(తెలంగాణ స్కిల్ అకడమిక్ ట్రైనింగ్) ప్రసారాలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో మంచి తోడ్పాటు అందించాయని ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటే తమ ప్రయత్నాలకు మంచి ఫలితాలు వస్తున్నాయన్న ఆనందం కలుగుతోందని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

# మంచికి ఖర్చు చేస్తేనే సంపదకు విలువ, గౌరవం

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ,మహానాడు:** సమాజంలో ఎంత సంపాదించినా ఆ డబ్బుకు నిజమైన విలువ, గౌరవం పెరగాలంటే మంచి పనులకు వెచ్చించాలని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండలో కాకతీయ కమ్మ వసతి గృహంలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తికమాస వనసమారాధనలో జీవీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. తాను డిగ్రీలో చేరినప్పుడు గుంటూరు కమ్మ వసతిగృహంలో ప్రవేశం జీవితంలో పెద్దమలుపు అన్నారు. అక్కడ ఎంతో మందికి సాయం చేసిన బొల్లేపల్లి సత్యనారాయణ అనేదాత స్ఫూర్తితోనే తాను కూడా భవిష్యత్‌లో ఆ స్థాయిలో ఉండాలని లక్ష్యం పెట్టుకున్నట్టు తెలిపారు. ఈరోజు తనకు శివ శక్తి ఫౌండేషన్‌ను ఇచ్చినా, ఆర్థికంగా వందలకోట్లు ఇచ్చినా ఆ సంకల్పానికి దేవుడి ఆశీర్వాదమే కారణమన్నారు.

వశక్తి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు, లీడ్ ఇండియా కార్యక్రమాలు, కంటి శస్త్రచికిత్సలు, ఇవన్నీ ఆనాటి దాతల స్ఫూర్తితోనే అని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు కమ్మ వారికి సేవ చేయాలని అప్పుడే అనుకున్నానని, కమ్మ వసతిగృహాలు, భవనాలకు కూడా ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. కమ్మ కులంలో ఉన్న పేదవారిని చదివించడానికి ఎవరికి శక్తికి తగ్గట్లు సాయం చేయాలన్నారు. పక్కవారికి పెట్టే అలవాటు చిన్నప్పుడు తల్లి నుంచే అలవడిందన్నారు. అలానే కమ్మవారు ఎక్కడ ఉన్నా



10 మందికి సాయంచేసే విధంగా ఉండాలని కోరుకుంటానని తెలిపారు. పిల్లలను కూడా 10 మందికి సాయం చేసేలా తీర్చి దిద్దాలని సూచించారు. అలానే ఒక కుమార్తె చాలు, ఒక కుమారుడు చాలు అనే ధోరణులు మార్చుకోవాలని కోరారు.

పిల్లలను కనడం తగ్గించవద్దని ఇటీవలే సీఎం చంద్రబాబు కూడా చెప్పారని, అందుకనే ఎంతమంది పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పోటీచేయొచ్చని బిల్లు కూడా తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తులో జనాభా తగ్గిపోతుందన్నారు.



దేశానికి యువతే సంపద అయిందని, జపాన్ లాంటి దేశాల్లో యువత తగ్గిపోయి వృద్ధులు పెరిగి పోయా రన్నారు. ఫలితంగానే ఎక్కువమంది పిల్లల్ని కనాలని ప్రభుత్వాలే ముందుకొచ్చి ప్రోత్సహిస్తున్నాయన్నారు.

పిల్లలు కూడా సంపద అనే విషయం గ్రహించాలన్నారు. కమ్మ కులస్థులు 10 కులాలను ఆదరించడం, ప్రోత్సహించడంలో, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి కూడా ముందుకు రావాలన్నారు. కులానికి, తెలుగుదేశం పార్టీకి, ఎన్డీఏ ప్రభుత్వం గౌరవం పెంచేలా నడుచుకుంటానని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా సమిష్టిగా పనిచేద్దామని, కక్షలు కార్పణ్యాలు లేకుండా అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు జిమ్మికులకు ప్రజలు ఓట్లు వేశారు...

- వైసీపీ సమన్వయకర్త వేమారెడ్డి

**గుంటూరు,మహానాడు:** మంగళగిరి మండలం, రూరల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం మంగళగిరిలోని ఆత్మకూరు జాతీయ రహదారి దరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు పాడి బండ్ల కృష్ణమూర్తి అధ్యక్షతన వహించారు. ఈ సమావేశంలో పార్టీ సమన్వయకర్త దొంతరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి ప్రజలందరూ మోసపోయారు.. చంద్రబాబు వేసిన జిమ్మికులకు ప్రజలు ఓట్లు వేశారు... ప్రజాస్వామ్యంలో ప్రజలు మాయమాటలకు మోసపోయినంత కాలం బతుకులు ఇలానే ఉంటాయన్నారు.

బడుగు బలహీన వర్గాల పేద ప్రజలందరూ ఎదగా లని ఆలోచనతో జగన్మోహన్ రెడ్డి ఆలోచనతో ఉంటే చంద్రబాబు కార్పొరేట్ సంస్థల పెట్టి పోషించే వ్యక్తిగా తయారయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆరు పథకాలలో ఒక్క పథకం తప్ప మిగతావి ఇంతవరకు ప్రజలకి అందలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు, మాజీ జడ్పి టిసిలు, ఎంపీటీసీలు, మాజీ వార్డు మెంబర్స్, మాజీ సర్పం చులు, ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

## చెరువులకు నీళ్లు ఇచ్చిన
# చరిత్ర చంద్రబాబుదే..

- ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి రఘునాథ్ రెడ్డి

**బుక్కపట్నం, మహానాడు:** చెరువులకు నీళ్లు ఇచ్చిన చరిత్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే సాధ్యమైందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. బుక్కపట్నం చెరువు కింద ఉన్న ఆయకట్టు భూములకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆదివారం నీటిని విడుదల చేశారు. ముందుగా బుక్కపట్నం చెరువు లో ఉన్న గంగ కు రైతులతో



కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజ చేసి తూము గేట్లు ఎత్తి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత చెరువులకు నీళ్లు ఇచ్చిన ఘనత ఒక తెలుగుదేశం ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందనన్నారు.

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే, టీడీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బడ్జెట్ లో సుమారు 16 వేల కోట్లపైగా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, వీటికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. అనంతపురం సత్యసాయి ఉమ్మడి జిల్లాలను హార్టికల్చర్, అగ్రికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

### చెరువు మధ్యలో సత్యసాయి విగ్రహం: రఘునాథ్ రెడ్డి

బుక్కపట్నం చెరువును ఎల్లప్పుడూ పూర్తిగా నీటితో నింపి మధ్యలో సత్యసాయి బాబా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని తెలిపారు ముఖ్యంగా బుక్కపట్నం చెరువు ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతిపెద్ద చెరువు అన్నారు.

ఈ చెరువు నీటి సామర్థ్యం 0.05 టీఎంసీలు ఉంటుందని ఈ చెరువు ఆయకట్టు కింద సుమారు పదివేలఎకరాలు సాగు అవుతుందని వెల్లడించారు. ఎంతో కరువు ఉన్న సమయంలో కూడా మూడు సార్లు ఈ చెరువును కృష్ణాజిల్లాలతో నింపిన చరిత్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపితోనే సాధ్యమైందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల ఆయ కట్టు రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇది త్యాగమైతే.. ఫలితం ఖాయం!

(బహదూర్)

రాజకీయాల్లో అహంకారం, ఆత్మాభిమానం ఈ రెండు విభిన్న ధృవాలే. అహంకారి తగిన మూల్యం చెల్లిస్తాడు... ఆత్మాభిమాని త్యాగశీలిగా మారతాడు. ఈ రెండింటిలోనూ ఆశకు అంతుండదు. ఫలితానికి పరిధి తప్పదు. ఇప్పుడు ఉభయ పశ్చిమ గోదావరి జిల్లా ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ రాజీనామా దారి తీసిన పరిస్థితులు, భవిష్యత్తుపైనే చర్చ జరుగుతోంది. ఔను తనకు తగిన ప్రాధాన్యత లేదని వైసీపీ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి.. వెంకటరమణ చరిత్ర సృష్టించి తన ఆత్మగౌరవాన్ని నిరూపించుకున్నారు. ఇందులో ఎలాంటి అనుమానాలు, అపవాదులకు అవకాశం లేదు. కానీ.. రాజకీయాల్లో ప్రశంసలు, విమర్శలు తప్పవు. ఆత్మాభిమానాన్ని కాపాడుకోవటానికి అకస్మిక నిర్ణయాలు సాధారణమే. కానీ రాజకీయ భవిష్యత్తుపై ఆలోచనపైనే అనేక ప్రశ్నలు దూసుకు వస్తాయి. 2029 మార్చి వరకూ జయమంగళ వెంకట రమణే ఎమ్మెల్సీ. మరో ఐదేళ్లు ఆయన పదవికి ఎలాంటి అడ్డులేదు. అకస్మాత్తుగా ఆయన ఎందుకు రాజీనామా చేశారు. ప్రస్తుతం శాసన మండలిలో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అర్ధంతరంగా మరో స్థానాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి దేనికొచ్చింది.

అంటే వెంకటరమణ తన స్థానాన్ని త్యాగం చేశారా? కావొచ్చు. కాకపోవచ్చు. కానీ జనం మాత్రం ఆయన త్యాగం చేశారని ఓ నిర్ణయానికి వచ్చేశారు. ఇందులోనూ ఓ బడా డీల్ తెరమీదకు వచ్చింది. ఆయన ఇంతకీ ఏ పార్టీలో చేరుతారు? టీడీపీ గేటు తెరుస్తుందా? తెరవచ్చు.. తెరవకపోవచ్చు. ఇప్పటికీ గేటు మూసే ఉంది. అసలు టెన్షన్ ఏమిటంటే... కూటమి ప్రభుత్వానికి శాసన మండలిలో బలం పెరగాలి. వెంకట



రమణ రాజీనామాతో వైసీపీకి ఎమ్మెల్యే కోటాలో 9 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. టీడీపీకి ఆరుగురు, జనసేనకు ఒకరున్నారు.

ప్రస్తుతం నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని కూటమి ప్రభుత్వం భర్తీ చేస్తే.. కూటమి బలం 11కు చేరుతుంది. ఈ స్థానాలను భర్తీ కోవటం కూటమికి కష్టం కాదు. ఎలాగు త్వరలోనే నాలుగు స్థానాల భర్తీ ఖాయం. ఇదే అదనుగా ప్రకాశం జిల్లాకు చెందిన ఓ నాయకుడు తన వ్యూహాన్ని రచించారు. పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే.. ఇటీవలే ఆయన జనసేన పార్టీలో చేరారు. ఇప్పట్లో ఎన్నికలు లేవు. ఐదేళ్లు ఆగాల్సిందే. ఈ స్థితిలో ఆయనకు తక్షణమే ఎమ్మెల్సీ హోదా కావాలి. ఇందుకు ఓ స్థానం ఖాళీ కావాలి.

నాలుగు స్థానాల్లో స్థానం కోసం టీడీపీ నుంచి ఎన్టీఆర్ జిల్లా నుంచి దేవినేని ఉమామహేశ్వరరావు, బుద్ధావెంకన్న గంపెడాశతో ఉన్నారు. వీరిద్దరిలో ఒకరికి ఎమ్మెల్సీ గ్యారెంటీ. ఇక పిఠాపురం సీటును త్యాగం చేసిన వర్మకు సీటు ఇవ్వాల్సిందే. మరో స్థానాన్ని బీజేపీకి ఇవ్వాలి. ఇక ఒంగోలు రెడ్డికి అవకాశం ఏది? అందుకే గుడివాడ టీడీపీ కోటరీలో ఓ కీలక నేతకు మధ్యవర్థిత్వ బాధ్యత అప్పగించారని ప్రచారం జరుగుతోంది. వెంకటరమణ త్యాగానికి తగిన ప్రతిఫలం డీల్ కుదిరిందని.. త్వరలోనే ఆయన కూడా జనసేనలో చేరుతారని విస్తృత ప్రచారం తెరమీదకు వచ్చింది.

ఇక జనసేన పార్టీ అధిష్టానం ఈ విషయాన్ని కొట్టిపారేయటం సహజం. కానీ.. సంపద సృష్టించాలంటే అభివృద్ధి అత్యవసరం. బలగంతోనే బలం. ఈ బలంతోనే పార్టీ అభివృద్ధి. ఇదొక రాజకీయ ఎత్తుగడే. కానీ జనసేన వ్యూహం ఎలా ఉంటుందో.. అలాగని . నిందారోపణలు తగవు. కానీ జన బాహుళ్యం అంచనాలను రాజకీయ పార్టీలో విశ్లేషణ అనివార్యం.

06
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 25, ఆగస్టు 2023 ||



గవర్నర్‌ను కలిసి ఇండియా కూటమి బలం, ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమని లేఖ అందచేస్తున్న సీఎం హేమంత్ సోరెన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, దాచేపల్లి టౌన్, బ్రాహ్మణగడ్డ లోని "మదర్స ఇస్లాహుల్ బానాత్ అరబిక్ బాలికల పాఠశాల" లో అయిదేళ్ళు ఆలిం కోర్స్ పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొని, విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.



కడప పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన అమీన్‌పీర్ దర్గాను సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ సందర్శించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



## కాపు సామాజిక వర్గ ఐక్యతను చాటి చెప్పండి

◆ వేద వ్యాస్ పిలుపు

మచిలీపట్నం, మహానాడు:

కాపు సామాజిక వర్గం ఐక్యతను చాటి చెప్పాలని బూరగడ్డ వేద వ్యాస్ పిలుపునిచ్చారు. మచిలీపట్నం జరిగిన కాపు వన సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సామాజిక వర్గం ఐక్యతను చాటే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇది శుభపరిణామం అన్నారు.. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు.



## రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే వేగుళ్ళ...

రుడా ఛైర్మన్‌గా నియమితులైన బొడ్డు వెంకటరమణ చౌదరి గార్ని ఆదివారం రాజమహేంద్రవరంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గారు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సంధర్బంగా బొడ్డు వెంకటరమణ చౌదరికి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, మల్లిపూడి గణేష్, తదితర్లు పాల్గొన్నారు.

## ఏపీలో సాగునీటి సంఘాల ఎన్నికలు

- కొత్త షెడ్యూలు విడుదల

అమరావతి, మహానాడు:

రాష్ట్రంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు కొత్త షెడ్యూలును సిద్ధం చేశారు. శాసనసభ సమావేశాలు జరుగుతుండటంతో గతంలో అనుకున్న షెడ్యూలు వాయిదాపడింది. తాజాగా డిసెంబరు 5న ఉమ్మడి 13 జిల్లాల్లో సాగునీటి వినియోగదారుల సంఘాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది.

దీని ప్రకారం డిసెంబరు 8న సాగునీటి సంఘాల ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల ఎన్నిక, సంఘాల అధ్యక్షుల, ఉపాధ్యక్షుల ఎన్నిక పూర్తవుతుంది. డిసెంబరు 11న జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులను ఎన్నుకుంటారు.

మధ్యతరహా, భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్ల ఎన్నిక డిసెంబరు 14న ఉంటుంది.

రాష్ట్రంలో మొత్తం 6,149 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 53 ప్రాజెక్టు కమిటీలు ఉండగా భారీ నీటి పారుదలలో 1,755 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 21,060 ప్రాదేశిక నియోజకవర్గాలు, మధ్యతరహాలో 266 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 3,192 ప్రాదేశిక నియోజవర్గాలు, చిన్ననీటి పారుదలలో 4,128 సాగునీటి వినియగదారుల సంఘాలు, 24,768 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్రం మొత్తం మీద 49,020 ప్రాదేశిక నియోజకవర్గాలు, వాటి కింద 71,11,712 ఎకరాల ఆయకట్టు వుంది. భారీ ప్రాజెక్టుల్లో 18 ప్రాజెక్టు కమిటీలు, మధ్య తరహాలో 35 ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. వీటికి ఎన్నికలు డిసెంబరు 14 లోపు ఎన్నికలు పూర్తి కానున్నాయి.





## గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేయాలి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ముప్పాళ్ల, మహానాడు:

మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని నిజం చేయాలనే సంకల్పంతో ప్రజలంతా కలిసి కట్టుగా పనిచేయాలని చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. అదేస్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రతిగ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని ఆయన తెలిపారు. ఈపూరు మండలం ముప్పాళ్లలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆదివారం ఆంజ నేయులు ప్రారంభించారు. ఎన్ఆర్ఐలు, ఐటీ ఉద్యోగులు, గ్రామస్థుల సహకారంతో సుమారు రూ.కోటి ఖర్చుతో విశాలమైన కల్యాణ మండపం నిర్మించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ శివా లయం పక్కనే గొప్ప కల్యాణ మండపం కట్టుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

సమష్టిగా పనిచేసి కల్యాణ మండపం నిర్మించిన కమిటీ పెద్దలు, దాతలందరినీ అభినందిస్తున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



## మత రహిత సమాజాన్ని కోరుకున్న గోరా

◆ డాక్టర్ సమరం

గుంటూరు,మహానాడు:

మతం మనిషిని బానిసగా మారుస్తుందని, స్వేచ్ఛగా శాస్త్రీయంగా ఆలోచింపనివ్వదని, మత రహిత సమాజమే సమాజ పురోగతికి తోడ్పడుతుందని, కోట్లాది ప్రజలకు వివరించి ఆచరించిన మహనీయుడు దివంగత గోపరాజు రామచంద్రరావు (గోరా) అని ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం కొనియాడారు. ఇక్కడి జన చైతన్య వేదిక హాలులో ఆదివారం గోపరాజు రామచంద్ర రావు జీవిత ప్రస్థానంపై జరిగిన సభకు ముఖ్య అతిథిగా సమరం హాజరై ప్రసంగించారు. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన గోరా సమాజ మార్పునకు నాస్తికత్వం, గాంధీజీ బోధనలు దోహద పడతాయని నమ్మి జీవితాంతం ఆచరించారన్నారు. అంటరానితనం, సామాజిక అసమానతలు, మూఢ నమ్మకాలపై నిరంతరం ప్రజలను జాగృతులను చేశారని అన్నారు.

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గుర్రం జాషువా కుమార్తె హేమలతను తన కోడలుగా స్వీకరించి ఆనాటి కులాలకు అతీతంగా ఆచరణలో అమలు చేశారన్నారు. గుర్రం జాషువా మహాకవిగా, ప్రజా కవిగా పేరు ప్రతిష్ఠలు సంపాదించినా వారిని కులం పేరుతో అవమానించిన, వివక్షకు గురైన సందర్భాలను గుర్తు చేస్తూ ప్రసంగించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ గోరా కుటుంబం నాటి సమాజంలో ఉన్న జోగిని, దేవదాసి వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడిందని, స్టువర్టుపురంలో కరుడు గట్టిన దొంగల్లో మార్పు తీసుకువచ్చిందన్నారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ శాసన సభ్యుడు లింగంశెట్టి ఈశ్వరరావు, మానవత ఛైర్మన్ పావులూరి రమేష్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, గాంధీయవాది, యోగా శిక్షకులు ఇందుశేఖర్, హేతువాది చంద్రశేఖర్, తదితరులు ప్రసంగించారు.

## మా ఇల్లు బఫర్ జోన్‌లో లేదు

◆ హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ

హైదరాబాద్, మహానాడు:

నగరంలోని మధురా నగర్‌లో మేం నివాసం ఉంటున్న ఇల్లు నాలుగు దశాబ్దాల కిందట మా నాన్నగారు నిర్మించినది. కృష్ణకాంత్ పార్కు దిగువున ఉన్న వేలాది ఇళ్ళ తర్వాత మా ఇల్లు ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో ఏమన్నారంటే... మా నాన్నగారు నిర్మించిన ఈ ఇల్లు బఫర్ జోన్లో ఉందని కొన్ని సామాజిక మాధ్యమాల్లో పాటు పేపర్లలో వచ్చిన వార్తలో వాస్తవం లేదు.

ఒకప్పటి పెద్ద చెరువునే రెండున్నర దశాబ్దాల క్రితం కృష్ణకాంత్ పార్కుగా మార్చిన విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ చెరువు కట్టకు దిగువున10 మీటర్లు దాటితే.. కిందన ఉన్న నివాసాలు ఇరిగేషన్ నిబంధనల మేరకు బఫర్ జోన్ పరిధిలోకి రావు. అయినప్పటికీ కట్టకు దాదాపు కిలో మీటర్ దూరంలో మేం నివాసం ఉంటున్న ఇల్లు ఉంది. వాస్తవాలు ఇలా ఉంటే తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొంతమంది చేస్తున్న ప్రయత్నాన్ని ఖండిస్తున్నాను.

మా నాన్న ఎ.పి.వి.సుబ్బయ్య 1980 సంవత్సరంలో మేం ఉంటున్న ఇంటిని నిర్మించారు. 44 సంవత్సరాల క్రితం నిర్మించిన అదే ఇంట్లో మా తండ్రితో కలిసి ఉంటున్నాం. ప్రస్తుత కృష్ణాకాంత్ పార్కు గా ఉన్న స్థలంలో సుమారు 25 సంవత్సరాల క్రితం ఒక చెరువు ఉండేది. చెరువున్నప్పటి నిబంధనల ప్రకారం అయినా మేం ఉంటున్న నివాసం కట్టకు ఒక కిలోమీటరు దూరంలో ఉంది.

సంస్కృతీ సంప్రదాయాలలో భాగంగా చెరువు కట్ట మీద, కట్టను ఆనుకొని కట్ట మైసమ్మ ఆలయాలు నిర్మిస్తారనే విషయం అందరికీ తెలిసిందే. మేం నివాసం ఉంటున్న ఇంటికి ఒక కిలోమీటరు




దూరంలో కట్ట మైసమ్మ గుడి ఉంది. ఎక్కడైనా చెరువు కట్ట ఎత్తుపై ఆధారపడి దిగువ భాగంలో 5–10 మీటర్ల వరకు ఉన్న స్థలాన్ని బఫర్ జోన్ గా ఇరిగేషన్ శాఖ పరిగణిస్తుంది. 25 ఏళ్ల క్రితం పెద్దచెరువు.. ప్రస్తుతం కృష్ణకాంత్ పార్కుగా మారిన స్థలం మా నివాసానికి 1 కి.మీ దూరంలో ఉంది. ఈ విషయాన్ని గమనించాలని కోరుతున్నాను.మేం నివాసం ఉంటున్న ఇల్లు బఫర్ జోన్లో లేదు అనేది వాస్తవం. అందరూ గ్రహించాలి. ఇందుకు సంబంధించిన ఫోటోలు కూడా పరిశీలించాలని కోరుతున్నాను.



## ఎమ్మిగనూరులో టెక్స్ టైల్స్ పార్కు నిర్మించి తీరుతాం

◆ 10 వేల మందికి ఉపాధి కల్పన

◆ పేదలకు, చేనేతలకు మధ్య చిచ్చు పెట్టిన జగన్

◆ ఆయన చేనేత ద్రోహి

◆ రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఫైర్

ఎమ్మిగనూరు, మహానాడు:

ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కు నిర్మించి తీరుతామని,ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి కల్పించనున్నమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి స్పష్టంచేశారు. ఎమ్మిగనూరులో ఆదివారం టెక్స్ టైల్స్ పార్కుకు కేటాయించిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. గడిచిన అయిదేళ్లలో చేనేత కార్మికులకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. 2014–19లో అప్పటి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) ప్రభుత్వం ఎమ్మిగనూరులో టెక్స్ టైల్స్ నిర్మించడానికి వంద ఎకరాలను కేటాయించిందన్నారు. చేనేతల అభివృద్ధి చెందడాన్ని జీర్ణించుకోలేని జగన్ రెడ్డి... ఆ స్థలంలో పేదల పేరుతో కొందరికి ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు.

చేనేతలకు, పేదలకు మధ్య ఘర్షణ సృష్టించాలన్నదే జగన్ రెడ్డి కుట్ర పన్నారని, ఆయన చేనేతల ద్రోహి అని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఎమ్మిగనూరు టెక్స్ టైల్స్ పార్కు నిర్మాణానికి చర్యలు



చేపట్టిందని తెలిపారు. ఇదే విషయమై ఇటీవల అసెంబ్లీలో కూడా స్పష్టంచేశామన్నారు. ముందుగా రూ.3.75 కోట్లతో టైక్స టైల్స్ పార్కులో మౌలిక సదుపాయలు కల్పించనున్నామన్నారు.

ఎమ్మిగనూరు టెక్స్ టైల్స్ పార్కు ద్వారా 5 నుంచి 10 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించనున్నామని మంత్రి సవిత తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ పంచలింగాల నాగరాజు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.










కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎమ్మిగనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహమును తనిఖీ చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌలి శాఖ మంత్రివర్యులు శ్రీమతి సవితమ్మ ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు జయ నాగేశ్వర రెడ్డి కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు..

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 25, ఆగస్టు 2023 ‖



## నవంబర్ 28న 'గేమ్ చేంజర్'
# థర్డ్ సింగిల్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఓ వైపు అభిమానులు, మరోవైపు సినీ ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. గేమ్ చేంజర్‌ను ఎస్‌వీసీ, ఆదిత్యరామ్ మూవీస్ సంస్థలు తమిళంలో విడుదల చేస్తుండగా హిందీలో ఏఏ ఫిలిమ్స్ అనిల్ తడాని రిలీజ్ చేస్తున్నారు. పక్కా ప్రమోషనల్ స్ట్రాటజీతో సినిమాపై అంచనాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌కు నెక్ట్స్ రేంజ్‌లో సినిమా ఉండేలా డైరెక్టర్ శంకర్ సినిమాకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇప్పటికే గేమ్ చేంజర్ చిత్రం నుంచి వచ్చిన పాటలు సోషల్ మీడియాను షేక్ చేశాయి. 'జరగండి', 'రా మచ్చా' పాటలు యూట్యూబ్‌లో చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. ఇక మరోసారి శ్రోతల్ని, అభిమానుల్ని కట్టి పడేసేందుకు మూడో పాటను రిలీజ్ చేయబోతోన్నారు. న్యూజిలాండ్‌లో రామ్ చరణ్, కియారా అద్వానీలపై షూట్ చేసిన ఈ మెలోడీ గీతాన్ని నవంబర్ 28న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు అప్డేట్ ఇస్తూ వదిలిన పోస్టర్లో రామ్ చరణ్, కియారా ఎంతో కూల్‌గా కనిపిస్తున్నారు. డిసెంబర్ 21న అమెరికాలో చరిష్మా డ్రీమ్స్ రాజేష్ కల్లెపల్లి 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్ అత్యంత భారీగా నిర్వహించబోతోన్నట్టుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. గేమ్ చేంజర్ టీజర్‌తో అంచనాలు పెంచిన చిత్రయూనిట్ ముున్ముందు మరిన్ని ప్రమోషనల్ కంటెంట్‌తో ఆడియెన్స్ ముందుకు రానుంది. రామ్ చరణ్ ఈ చిత్రంలో రెండు పవర్‌ఫుల్ పాత్రల్లో మెప్పించనున్నారు.



# ఎన్టీఆర్ తొలి పారితోషికం





విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, అన్నగారు ఎన్టీఆర్ నటించిన మొదటి సినిమా ఏది? పాత తరం వెంటనే చెప్పగలుగుతుంది కానీ నేటి జెన్ -జెడ్ జనరేషన్ కి గుర్తు చేయాల్సిన పరిస్థితి ఉంది. తెలుగు సినిమా 100 ఏళ్ల చరిత్రలో తొలితరం పేజీలను అలంకరించిన, వీకీ చరిత్రలో అసాధారణ స్టార్‌గా ఏలిన మేటి నటుడు ఎన్టీఆర్ టాలీవుడ్ లో ప్రారంభరోజులను ఓసారి స్మరిస్తే... - మన దేశం-ఎన్టీఆర్ నటించిన మొదటి చిత్రం. 1949లో విడుదలైన ఈ సాంఘిక చిత్రం విడుదలై నేటికి 75 సంవత్సరాలు పూర్తయింది. ఈ చిత్రంలో ఎన్.టి. రామారావు బ్రిటీష్ పోలీస్‌గా ఓ చిన్న పాత్రలో కనిపిస్తారు. దీనికి ఎల్.వి.ప్రసాద్ దర్శకుడు. ప్రసిద్ధ నటి కృష్ణవేణి ఈ చిత్రానికి నిర్మాత. ఈ సినిమా - విప్రదాస్ - అనే బెంగాలీ నవల ఆధారంగా తెరకెక్కింది. భారత స్వాతంత్ర్య సంగ్రామం ఈ చిత్ర కథకు నేపథ్యం. ఈ చిత్రంతో పరిచయమైన ఎన్.టి. రామారావు తరువాత తెలుగు చలనచిత్ర రంగంలో ఎంతో ప్రసిద్ధులయ్యారు. అలాగే ఈ చిత్రం ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత దర్శత్వం వహించిన మొదటి సినిమా. గాయని పి. లీల కూడా ఈ సినిమా ద్వారా తెలుగు సినిమా రంగంలో నేపథ్యగానంలో ప్రవేశించారు. ఇందులో రామారావు పోలీసు వేషం వేశాడు. సినిమా కథనంలో బుర్ర కథ, ఒగ్గు కథ, వీధి నాటకాలు, బొమ్మలాటలు వంటి సాంస్కృతిక కళారూపాలను కథనానికి జోడించారు. ఇంకా దేశ భక్తి గీతాలు, దంపుడు పాటలు, భజనలు, ఇతర జానపద గీతాలను ఉపయోగించారు. సినిమాలో గాంధీ గారి ఉన్నతాదర్శాలను, స్వాతంత్రం సిద్ధించిన తరువాత దిగజారిన విలువలను చూపించారు. ఇది బెంగాలీ కథ ఆధారంగా వెలువడిన మొదటి తెలుగు సినిమా. తరువత దేవదాసు, ఆరాధన వంటి అనేక బెంగాలీ నవలలు తెలుగు సినిమా కథలుగా మారి విజయవంతమయ్యాయి. స్వాతంత్ర్యం రాకముందు ప్రారంభించినప్పటికి కొన్ని కారణాలవల్ల స్వాతంత్ర్యానంతరం పూర్తిచేసి విడుదల చేయగలిగారు. ఈ చిత్రంలో పోలీసు ఇన్స్‌పెక్టరు పాత్ర పోషించిన ఎన్.టి.ఆర్.కు రూ.2000 పారితోషికం ఇచ్చారు. నిజంగానే లాఠీ ఛార్జ్ తో రెచ్చిపోయిన ఎన్టీఆర్: ఎల్వీ ప్రసాద్ వద్ద ఫోటో చూసిన నిర్మాత బిఏ సుబ్బారావు ఎన్టీఆర్ ని స్క్రీన్ టెస్ట్ కి రావాల్సిందిగా పిలవగానే విజయవాడ నుంచి ఆయన మద్రాసు రైలెక్కారు. అలా తొలిసారి సినిమా కోసం ఫోటోషూట్ లో పాల్గొన్నారు ఎన్టీఆర్. టెస్ట్ పూర్తయ్యాక మరో ఆలోచన లేకుండా తను తీస్తున్న %-%పల్లెటూరి పిల్ల%-% చిత్రంలో హీరోగా అవకాశం కల్పించారు. కానీ ఆ సినిమా రకరకాల కారణాలతో మధ్యలో ఆగిపోయింది. అప్పటికే ఎల్వీ ప్రసాద్ మనదేశం కాస్టింగ్ ఎంపికలు పూర్తి చేసి దర్శకత్వ బాధ్యతలను చేపట్టారు. ఇక ఈ సినిమాలో సీనియర్ నటులంతా ఓకే అయ్యాక చివరిగా కానిస్టేబుల్ పాత్రకు ఎన్టీఆర్ అయితే సరి పోతాడని ఎంపిక చేసుకున్నారు. హీరోని అరెస్ట్ చేసి ఉద్యమ కారులను అణచివేసే సీన్‌లో ఎన్టీఆర్ రంగ ప్రవేశం.. అతడు పూనకం వచ్చినట్టు ఉద్యమకారులపై లాఠీ ఛార్జ్ చేసారు. దీంతో ఎన్టీఆర్ దూకుడుకు బెదిరిన ఎల్వీ ప్రసాద్ ఇది రంగస్థలం కాదని, అక్కడిలా కాకుండా ఇక్కడ కేవలం కొడుతున్నట్టు నటించాలని సూచించారు. మొత్తానికి ఎన్టీఆర్ చరిష్మా చూసాక ఇతడు పెద్ద స్టార్ అవుతాడని ఆరోజుల్లోనే ఎల్వీ ప్రసాద్ అంచనా వేసారు. కృష్ణవేణి-మీర్జాపూర్ రాజా నిర్మించిన ఈ చిత్రంతో ఎన్టీఆర్ అనే నటుడు భారతీయ సినిమా తెరకు పరిచయం అయ్యారు.



# ఎవరు నెం.1 హీరో

తెలుగు సినీ పరిశ్రమ రోజురోజుకు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. రాజమౌళి లాంటి దర్శకులు జాతీయస్థాయికి, అక్కడి నుంచి అంతర్జాతీయస్థాయికి తీసుకువెళ్లగా, సుకుమార్, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్ లాంటి దర్శకులు దాన్ని అలాగే కొనసాగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగు స్టార్ హీరోలకు దేశవ్యాప్తంగా క్రేజ్ పెరుగుతోంది. ప్రభాస్ ఇప్పటికే తెలుగుకన్నా హిందీ హీరో అయిపోయాడు. అలాగే జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ పాన్ ఇండియా హీరోలుగా చెలామణి అవుతు న్నారు. దేశవ్యాప్తంగా వీరికి క్రేజ్ ఉంది. మహేష్ బాబు, పవన్ కల్యాణ్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, నాని, రవితేజ లాంటివారు తెలుగులోనే సినిమాలు చేస్తున్నారు. నాని మాత్రం ఇతర భాషల్లో కూడా తన సినిమాల విడుదల ఉండేలా చూసుకుంటున్నారు. నిరంతరం చర్చ జరుగుతోంది ఏ భాషలో లేనివిధంగా మన తెలుగులోనే ఎక్కువమంది స్టార్ హీరోలున్నారు. వీరిలో నెంబర్ 1 ఎవరు అనే చర్చ నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నెంబర్ వన్ అనేది సినిమా సినిమాకు మారిపోతోంది. ఒక హీరో సినిమా థియేటర్లలో రూ.500 కోట్లు రాబడితే, తర్వాత మరో హీరో సినిమా రూ.వెయ్యి కోట్లు రాబడుతోంది. ఆ తర్వాత మరో హీరో సినిమా రూ.1500 కోట్లు రాబడుతోంది. ఇలా హీరో క్రేజ్ అనేది థియేటర్లలో, దేశవ్యాప్తంగా వసూలయ్యే వసూళ్లనుబట్టి ఆధారపడి వుంటుంది. సినిమా ఫ్లాప్ అయితే తర్వాత సినిమా మీద అంచనాలు ఉండటంలేదు. " ఆ హీరోతో కలిసి బెడ్ రూమ్‌లో రెచ్చిపోయిన కీర్తి సురేష్..'మహానటి'కి ఇదో మాయని మచ్చ" ఎవరికి ఎక్కువ కలెక్షన్లు వస్తే వారే స్టార్ హీరోల సినిమా అనే సంబంధం లేకుండా మీడియం రేంజ్, చిన్న సినిమా హీరోలు నటించిన సినిమాలు కూడా అద్భుతమైన కలెక్షన్లు కొల్లగొట్టి ఒక్కసారిగా వారిని స్టార్ హీరోలుగా మార్చేస్తు న్నాయి. ఏ హీరో స్థానం ఒకే స్థానంలో ఉండటంలేదు. సినిమా సినిమాకు మారిపోతోంది. ఎవరైతే బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లు సాధిస్తారో వారే నెంబర్ వన్ గా నిలుస్తున్నారు. తర్వాత మరో హీరో సినిమా వచ్చి కొంచెం ఎక్కువ కలెక్షన్లు సాధించగానే అతను నెంబర్ వన్ హీరో అయిపోతున్నాడు. ఇలా పర్మినెంట్ గా నెంబర్ వన్ హీరో అని కాకుండా సినిమా సినిమాకు, వాటి కలెక్షన్ల ఆధారంగా నెంబర్ వన్ ఎవరనేది ఆధారపడుతోంది. సినిమాకు వచ్చే కలెక్షన్లే హీరోల స్థానాలను నిర్ణయిస్తున్నాయి.

## జ్యోతి గ్లామర్ డోస్



గుప్పెడంత మనసు సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకి పరిచయం అయిన కన్నడ నటి జ్యోతి పూర్వజ్. జ్యోతి రాయ్ పేరుతో నటిగా అరంగేట్రం చేసిన ఈ బ్యూటీ సీరియల్ లో హీరో తల్లి పాత్రలో నటించింది. తరువాత ఈ సీరియల్ లో తన పాత్ర కంప్లీట్ అయ్యాక పూర్తిస్థాయిలో గ్లామర్ వైపు ఫోకస్ చేసింది. యంగ్ డైరెక్టర్ సుకు పూర్వజ్ ని వివాహం చేసుకున్న జ్యోతి రాయ్ తన పేరుని కూడా మార్చుకుంది. ప్రస్తుతం సుకు పూర్వజ్ దర్శకత్వంలోనే 'ఏ మాస్టర్ పీస్' అనే సూపర్ హీరో చిత్రంలో జ్యోతి పూర్వజ్ నటించింది. ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే భర్త సుకు దర్శకత్వంలో రీసెంట్ గా 'కిల్లర్' అనే సినిమాకి ఆమె సైన్ చేసింది. దాంతో పాటు మరో సినిమా కూడా ఆమె చేతిలో ఉంది. ఇలా మూడు, నాలుగు సినిమాలకి జ్యోతి పూర్వజ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. ఇదిలా ఉంటే జ్యోతి పూర్వజ్ ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో జ్యోతి షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతాయి. రెగ్యులర్ గా జిమ్ లో వర్క్ అవుట్ లు చేస్తూ పర్ఫెక్ట్ లుక్ తో తన అందాన్ని జ్యోతి పూర్వజ్ మార్చుకుంటుంది. ఆమె అందం, ఆకర్షణతో ఇట్టే ఆకట్టుకుంటుంది. ఈ కారణంగానే జ్యోతి పూర్వజ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంటుంది. కొన్ని ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. మంత్రముగ్ధులని చేసే అందంతో ప్రకాశవంతంగా మెరిసిపోతుంది. ప్రతి హృదయాన్ని ఆమె గ్లామర్ ఇట్టే ఆకర్షిస్తుంది.



## ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం
# అవార్డ్సులో "సత్య"

హార్ట్ టచింగ్ షార్ట్ ఫిలింగా అందరి ప్రశంసలు పొందింది సుప్రీమ్ హీరో సాయిదుర్గ తేజ్ నటించిన "సత్య". ఈ షార్ట్ ఫిలిం ఇప్పుడు ఫిలింఫేర్ షార్ట్ ఫిలిం అవార్డ్స్ 2024లో పోటీ పడుతోంది. పీపుల్స్ ఛాయిస్ కేటగిరిలో "సత్య" షార్ట్ ఫిలిం పోటీలో నిలిచింది. ఈ సందర్భంగా సాయిదుర్గ తేజ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. తమ మనసుకు దగ్గరైన షార్ట్ ఫిలిం ఇదని, "సత్య" షార్ట్ ఫిలిం చూసి ఓటు వేయాలని ప్రేక్షకుల్ని కోరారు. దిల్ రాజు ప్రొడక్షన్స్ తో కలిసి తమ విజయదుర్గ ప్రొడక్షన్స్ సంస్థలో చేసిన తొలి ప్రయత్నంగా "సత్య" ఎన్నో మెమొరీస్ ఇచ్చిందని సాయిదుర్గ తేజ్ పేర్కొన్నారు. "సత్య" షార్ట్ ఫిలింలో స్వాతి రెడ్డి హీరోయిన్‌గా నటించింది. హర్షిత్, హన్షిత నిర్మాతలుగా వ్యవహరించారు. విజయకృష్ణ వీకే దర్శకత్వం వహించారు. మ్యూజికల్ షార్ట్ ఫిలింగా "సత్య" ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చింది. ఫిలింఫేర్ వెబ్ సైట్ ద్వారా ప్రేక్షకులు తమ ఓటును వినియోగించుకోవచ్చు.

## పూజా కార్యక్రమాలతో
# ప్రారంభమైన "వశిష్ఠ"


సుమన్ తేజ్, అను శ్రీ హీరో హీరోయిన్లు గా నటిస్తున్న సినిమా "వశిష్ఠ". ఈ చిత్రాన్ని బేబి నేహా సమర్పణలో లిటిల్ బేబీస్ క్రియేషన్స్ బ్యానర్ పై నోరి నాగప్రసాద్ నిర్మిస్తున్నారు. మైథలాజికల్ సోషల్ డ్రామా కథతో దర్శకుడు హరీశ్ చావా రూపొందిస్తున్నారు. "వశిష్ఠ" మూవీ ఈ రోజు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. తెలుగు టెలివిజన్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ నాగబాల సురేష్ కుమార్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్



నివ్వగా, నిర్మాత లయన్ సాయివెంకట్ స్క్రిప్ట్ అందజేశారు. నటుడు గగన్ విహారి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. యాడ్ ఫిలింమేకర్ యమున కిషోర్ ఫస్ట్ షార్ట్ డైరెక్షన్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ హరీశ్ చావా మాట్లాడుతూ - మా వశిష్ఠ మూవీ ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే సోషల్ డ్రామా ఇది. ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్ టైనర్ మూవీ. కథ వినగానే సింగిల్ సిట్టింగ్ లో మా హీరో సుమన్ తేజ్ ఓకే చేశారు. మంచి టీమ్ నాకు సపోర్ట్ గా దొరికింది. మ్యూజిక్ మీర్ వలీ, డీవోపీ కార్తీక్ ఎంతో సపోర్టివ్ గా ఉన్నారు. టీమ్ లో ఏ టెక్నీషియన్ కూడా ఇబ్బంది పెట్టకుండా కోపరేట్ చేస్తున్నారు. అలాగే మా ప్రొడ్యూసర్ నాగ ప్రసాద్ నాకు వెన్నంటే ఉన్నారు. ఒక మంచి మూవీతో మీ ముందుకు వస్తాం. మీ అందరి సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా అన్నారు.

## పెయిడ్ ప్రీమియర్స్ ఫ్లస్సేనా?



పెయిడ్ ప్రీమియర్ అన్నది దమ్మున్నోడి మాట..బాట అనొచ్చు. ప్రొడక్ట్ పై ఎంతో నమ్మకం ఉంటే తప్ప పెయిడ్ ప్రీమియర్ సాహసం చేయరు. పక్కాగా కొడతాం? అనే నమ్మకం మేకర్స్ లో ఉంటేనే పెయిడ్ ప్రీమియర్ జోలికి వెళ్లాలి. లేదంటే? ఉన్నది కూడా ఊడిపోతుంది అన్నది అంతే వాస్తవం. పెయిడ్ ప్రీమియర్ కి ముందస్తు పాజిటివ్ టాక్ వస్తే ఓపినింగ్స్ ఎలా ఉంటాయో? సినిమా పోయింది అనే టాక్ వస్తే? పరిస్థితి అంతే దారుణంగా ఉంటుంది అన్నది గుర్తించాలి. విషయం ఉన్న చిన్న సినిమాలకు పెయిడ్ ప్రీమియర్ అన్నది ఓ వరంగా చెప్పొచ్చు. టాలీవుడ్‌లో ఇప్పుడు ఇదే ట్రెండ్. 90 శాతం మందికి ఇది కలిసొస్తుంది. ఒక్కరోజు ముందు సినిమా చూపించడం అంటే అనుకున్నంత ఈజీ కాదు.. ఆ సినిమా భవిష్యత్తును ముందుగానే డిసైడ్ చేసే హక్కు ఆడియన్స్ చేతిలో పెట్టడమే. అది కొన్నిసార్లు వర్కవుట్ అవ్వొచ్చు.. కొన్నిసార్లు కాకపోవచ్చు. కానీ చిన్న సినిమాని జనాల్లోకి తీసుకెళ్లాడనికి ఏకైక మార్గం ఇది. పెళ్లి చూపులు' ఆ తర్వాత 'బేబి' ,'సామజవరగమన', 'మేజర్', 'సార్', 'ఘాజీ' ,'బలగం', 'రైటర్ పద్మభూషణ్' ఇంకా చాలా సినిమాలు పెయిడ్ ప్రీమియర్లతోనే మంచి విజయాలు సాధించాయి. ఇవన్నీ రిలీజ్ కి ఒకటి రెండు రోజుల ముందే వేసిన సినిమాలు. వీటికి రిలీజ్ అనంతరం మంచి పాజిటివ్ టాక్ వచ్చింది. దీంతో భారీ ఎత్తున ఓపెనింగ్స్ దక్కాయి. అప్పటికప్పుడు థియేటర్ల సంఖ్య పెరిగింది. ఈసినిమాల్లో కంటెంట్ ఉంది కాబట్టి హిట్ అయ్యాయి. కంటెంట్ లేకుండా పెయిడ్ ప్రీమియర్లు వేస్తే ఫలితం శూన్యమే. అలాంటి సినిమాలకు పెయిడ్ ప్రీమియర్ అన్నది అతి పెద్ద రిస్క్. కనీస ఓపెనింగ్ లు కూడా రావు. ఇలాంటి సినిమాలు పెయిడ్ ప్రీమియర్ కాకపోయి ఉంటే? టాక్ ఎలా ఉంది? అన్నది జనాలకు తెలియదు. కనీసం ఓ సారి ట్రైచేద్దామనో? టైంపాస్ కోసమైనా థియేటర్ కి వచ్చే అవకాశ ఉంటుంది.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

## డిజిటల్ మీడియాలో ..
# జయహో "మహానాడు"
# 2,70,650

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1 న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారథ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)
సారథ్యంలో

